# పది సంవత్సరాల
# సమీక్షా సమావేశానికి




# నివేదిక

పది సంవత్సరాల పనిపై జరుపుకుంటున్న సమీక్షా సమావేశానికి వచ్చిన సంస్థ సభ్యులందరికీ ఆహ్వానం. ఈ పది సంవత్సరాల కాలంలో మనం పెట్టుకున్న అజెండాను ముందుకు తీసుకుపోవడానికి ఏ మేరకు పని చేయగలిగాము, ఇంకా ఎంత చేయవలసి ఉంది, నిర్మాణం ఎంతవరకు పెంచుకోగలిగాము, ఇంకా ఏ విధంగా మెరుగుపరుచుకోగలుగుతాము ఇత్యాది విషయాలు చర్చించుకొని భవిష్యత్ ఆచరణకు సూచనలు, సలహాలు సేకరించడం ఇవాల్టి సమావేశం లక్ష్యం.

మిర్యాలగూడెంలో 2005లో జరిపిన మొదటి రాష్ట్ర మహాసభలలో ఆమోదించిన సంస్థ ప్రణాళికలోని తొలి వాక్యాలను ఉటంకించి ఈ సమీక్షను ప్రారంభించడం ఉచితంగా ఉంటుంది.

''ఒక విశాలమైన, స్వతంత్రమైన హక్కుల ఉద్యమాన్ని నిర్మించడం మానవహక్కుల వేదిక లక్ష్యం''.

''ప్రజా బాహుళ్యంలోని ప్రజాస్వామిక ఆకాంక్షల సాధనకు తోడ్పడడం హక్కుల ఉద్యమం కర్తవ్యం. తమ జీవితాలను మెరుగు పరచుకునే అవకాశాలు అన్ని కోణాలలోనూ అభివృద్ధి చెందాలనీ, పరిపాలనలో ప్రజాస్వామ్యం బాగుండాలనీ, పాలనా విధానాలు ప్రజల జీవితాలను బాగుపరిచే దిశగా సాగాలనీ, సమత, స్వేచ్ఛ, స్వతంత్రం, ఆత్మగౌరవం మొదలయిన మానవతా విలువలకు సమాజంలో సముచిత స్థానం ఉండాలనీ, మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతి నెలకొనాలనీ ప్రజలు నిత్య జీవితంలో కోరుకుంటారు. ఈ కోర్కెల సాధనకు తన పద్ధతిలో తోడ్పడటం హక్కుల ఉద్యమం కార్యాచరణకు గీటురాయి''.

''ఈ కృషిలో కలిసిరాగల వారందరికీ చోటు కల్పించే విశాల స్వభావాన్నీ, అవగాహననూ, నిర్మాణాన్నీ హక్కుల ఉద్యమం రూపొందించుకుంటుంది''.

తరచుగా హక్కుల ఉద్యమం ఎదుర్కొనే ఒక ప్రశ్నను మన ప్రణాళికలోనే వేసుకొని జవాబు చెప్పుకున్నాం. అదేమిటంటే, హక్కుల లేమిని లేక అణచివేతను అనుభవించే ప్రజలు తమ సంఘాలు పెట్టుకొని ఆందోళన చేస్తారు. దళిత సంఘాలు, కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు ఆయా సామాజిక వర్గాలు, శ్రేణుల హక్కుల సాధన కోసం ఉండనే ఉన్నాయి. అలాంటప్పుడు ప్రత్యేకంగా ఒక హక్కుల ఉద్యమం ఆవశ్యకత ఏమిటి? అనేది. దీనికి మన ప్రణాళికలో మూడు కారణాలు చెప్పుకున్నాం.

ఒకటి, ''పోరాటాలు చేయలేని ప్రజలు, సంఘటితం కాలేని ప్రజలు చాలామంది ఉంటారు. ప్రజలు సంఘటితం కాలేని సందర్భాలు చాలా ఉంటాయి''. అసలు తమకు హక్కులు ఉన్నాయనీ వాటికి గుర్తింపు లేకుండ పోయిందనీ ఒక ప్రజావర్గానికి తెలియని సందర్భాలు ఉంటాయి. అటువంటప్పుడు వారి హక్కులను వారికి తెలియజేయడం, వాటిని వారి తరపున, వారితోబాటు వ్యక్తం చేయడం, వాటి సాధన కోసం సంఘటితం కావడానికి వారికి తోడ్పడడం మన కర్తవ్యం అవుతుంది.

రెండు, ''ఒక ప్రజావర్గం తన హక్కుల కోసం పోరాడటం వేరు, 'హక్కులు' అనే భావనను పెంపొందించడం కోసం కృషి చేయడం వేరు. ఈ రెండింటి మధ్య పరస్పర సంబంధం ఉన్నప్పటికీ ఇవి వేరు వేరు కర్తవ్యాలు. నిర్దిష్టమైన హక్కుల సాధనకూ 'హక్కులు' అనే భావన వ్యాప్తికీ మధ్యనున్న తేడా ఇది. రెండవ కృషి విజయవంతమైన మేరకు అది మొదటి కృషికి విస్తృతి కల్పిస్తుంది. విభిన్నమైన హక్కుల పోరాటాల మధ్య వారధిగా పనిచేస్తుంది''. ఒక ప్రజావర్గం తన హక్కుల కోసం చేసే పోరాటం తరచుగా వారి పోరాటం దగ్గరే ఆగిపోతుంది. అందులోని 'హక్కుల' అంశాన్ని ముందుకు తీసుకుపోయి ఇతర సామాజిక రంగాలకు వర్తింపజేసే కర్తవ్యం మిగిలిపోతుంది. దానిని వారి అవసరం నుండి పుట్టిన ఆరాటంగా మాత్రమే కాక నాగరికతా విలువగా నిలబెట్టే అవసరమూ ఉంటుంది. ఇది హక్కుల ఉద్యమం కర్తవ్యం.

మూడు, 'ప్రజలలోని ప్రజాస్వామిక ఆకాంక్షలు అన్ని సందర్భాలలోనూ సమగ్రంగా ఉండవు. ఒక్కొకసారి వాటిలో వైరుధ్యాలుంటాయి. అపోహలుంటాయి. తమ కోసం హక్కులు కోరుకుంటూ తమ తోటివారికి నిరాకరించే సందర్భాలు కూడా ఉంటాయి. వివిధ కారణాలవల్ల తామే హక్కుల అతిక్రమణకు సాధనాలుగా పనిచేసే సందర్భాలూ ఉంటాయి''. ఈ సమస్యలనూ, పరిమితులనూ అధిగమించడం కోసం కృషి చేయడం, ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు ఒక సమగ్రత కల్పించే ప్రయత్నం చేయడం కూడా హక్కుల ఉద్యమం కర్తవ్యమే.

మనం ఈ పది సంవత్సరాలలో ఏయే విషయాలపైన ఎంత పని చేయగలిగాం అని చర్చించుకొనేటప్పుడు మన లక్ష్య ప్రకటనలో గుర్తించిన వివిధ అణచివేత సందర్భాలనొకసారి ప్రస్తావించడం ఉచితంగా ఉంటుంది. ''సమాజంలో వ్యవస్థీకృతంగా ఉన్న అసమానత, అణచివేత హక్కుల లేమికి మూలం'' అని చెప్పి, ప్రస్తుత సమాజంలోని ప్రధాన అణచివేత రూపాలుగా కొన్నిటిని ఏకరవు పెట్టాము. ''వనరులపైన అసమాన యాజమాన్యం, కులపెత్తనం, వర్ణ ధర్మ సంస్కృతి, స్త్రీలపైన ఇంటా బయటా మగవారి పెత్తనం, రాజకీయ ఆర్థిక జీవితంపైన అభివృద్ధి సాధించిన ప్రాంతాల వారి ఆధిపత్యం, ప్రకృతినీ పర్యావరణాన్నీ ధ్వంసం చేసే అభివృద్ధి నమూనా, పెట్టుబడిదారీ

ఆర్థిక నీతి, ఆదివాసుల జీవన వనరులపైన బయటి వారి ఆధిపత్యం, ప్రపంచీకరణ పేరిట నెలకొంటున్న ప్రపంచ పెట్టుబడిదారీ పెత్తనం, మత మైనారిటీలపైన అణచివేత, రాజ్యాంగ యంత్రానికి ఉండే అణచివేత అధికారాలు మొదలైనవి''. నిద్రాణంగా ఉన్న ఆకాంక్షలు మేల్కొనే కొద్దీ కొత్తకోణాలు ముందుకు వస్తాయి కాబట్టి ''మొదలైనవి'' అనక తప్పదు.

ఈ పది సంవత్సరాలలో లక్ష్య ప్రకటనలో ఏకరవు పెట్టిన అన్ని అంశాల గురించీ ఎంతో కొంత పనిచేసామని సంతృప్తి వ్యక్తం చేయడం ఎంత సబబుగా ఉంటుందో, కొన్ని తప్ప ఇతర అంశాల గురించి మనం చేయగలిగినంతా చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేయడం కూడ అంతే సబబుగా ఉంటుంది.

## 1. విధ్వంసకర ప్రభుత్వ ఆర్థిక విధానాలు

ఈ పది సంవత్సరాలలో అన్ని సమస్యల కంటె మనం కొంచెం ఎక్కువ దృష్టి పెట్టింది వికృత, విధ్వంసకర విధానాల పర్యవసానాలపైనే. దాదాపు 1998 నుండే రైతుల ఆత్మహత్యలు రాష్ట్రంలో పెద్దెత్తున జరుగుతున్నాయి. వాటిని కాకతాళీయమైన విపత్తుగా కాకుండ దేశపాలకులు అనుసరిస్తున్న వ్యవసాయ అభివృద్ధి విధానాల ఫలితమని గుర్తించిన మొదటి సంస్థలలో మనదొకటి. విస్తృతంగా సంబంధిత ప్రాంతాలలో పర్యటించి బాధిత కుటుంబాలతో మాట్లాడి ఈ ఆత్మహత్యలకు గల కారణాలను వెలికితీయడంలో భాగం పంచుకున్నాము. పత్రికా ప్రకటనల ద్వారా, బహిరంగ సభల ద్వారా, వివరమైన కరపత్రం ద్వారా వీటిని ప్రజానీకానికి తెలియజేసాము. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఆత్మహత్యల నివారణకోసం నియమించిన జయతిఘోష్ కమిటీకి మన అభిప్రాయాలు వివరంగా చెప్పాము. సరళమైన ప్రభుత్వరంగ రుణ వ్యవస్థ లేకపోవడం, విత్తనాలు, ఎరువులు, మందుల నాణ్యతపైన గానీ ధరలపైన గానీ నియంత్రణ లేకపోవడం, సాగునీటి లభ్యతలోని అస్తవ్యస్త పరిస్థితి, పంటకు గిట్టుబాటుధర లభించకపోవడం; ఇందుకు కారణాలుగా అందరమూ గుర్తించాము. వీటి నివారణ, పరిష్కారాల గురించి జయతి ఘోష్ కమిటీ చేసిన సూచనలు అమలు కాలేదని విమర్శించాము.

అంతవరకు బాగానే ఉందిగానీ, రైతుల ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వం ఏమీ చేయకపోయినా బాధిత కుటుంబాల ఉపశమనం కోసం జివో 421 రూపంలో ఒక ఆదేశం జారీ చేసింది. కాని దానిని చాలా కుదించి అమలు చేసే ప్రయత్నం ఉద్దేశ్యపూర్వకంగానే అధికారులు చేస్తుండడం వల్ల అందవలసిన ఉపశమనం చాలా కుటుంబాలకు అందడం లేదు. దీని గురించి ప్రత్యేకంగా కృషి చేయాలనీ, అందరికీ అది అందేటట్టు చూడాలనీ చాలాసార్లు అనుకున్నాము గానీ ఒకటి రెండు జిల్లాల్లో తప్ప ఈ నిర్ణయం అమలు కాలేదు. అప్పులపాలయిన రైతులు ఆత్మహత్య చేసుకునే ఉదంతాలేకాక, తీవ్ర పేదరికం కారణంగా గతిలేని మరణం పాలయ్యే ఘటనలూ జరుగుతున్నాయి. వీటిని 'ఆకలి చావులు' అని వర్ణిస్తే ప్రభుత్వానికి కోపం వస్తుంది గానీ పని చేయలేని స్థితిలో ఉన్న వారికి కనీస జీవన భృతి ఇవ్వాలి అన్న బాధ్యతను ప్రభుత్వాలు విస్మరించడం ఈ చావులకు దారితీస్తున్నది. ఇటువంటి మరణాలను వెలికి తీసి ప్రభుత్వ బాధ్యతను చర్చకు పెట్టే ప్రయత్నం మెదక్ జిల్లాలో కొంత జరుగుతున్నది. ఆ ప్రయత్నంలో మనం కూడ భాగం పంచుకుంటున్నాం. దీనిని రాష్ట్రమంతటా విస్తరించాలి.

నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలిచావుల విషయమూ అంతే. ఈ పది సంవత్సరాలలో ప్రకాశం, కరీంనగర్, మెదక్ (ఈమధ్య నల్గొండ) జిల్లాల్లో చేనేత కార్మికులు, మరమగ్గాల కార్మికుల జీవితాలలోని సంక్షోభం గురించి చాలాసార్లు నిజనిర్ధారణ కమిటీలు వేసాము, ప్రచారం చేసాము. ఈ రంగాలలో ఉన్న శ్రామికులకు ప్రతిరోజూ చేతినిండా పని దొరకాలి, బతకడానికి సరిపడే వేతనం లభించాలి, నేతరంగానికి సంబంధించిన ముడి సరుకులు, ఉత్పత్తుల మార్కెట్‌లను వీటికి తగినట్టు నియంత్రించుకోవాలి అనేది ఈ సంక్షోభం పరిష్కారానికి మార్గం కాగా, పాలకులు అందుకోసం ఏమీ చేయకుండ టెక్స్‌టైల్ పార్కులు, జెట్‌లూంల వంటి వింత వింత పరిష్కారాలు ముందుకు తెస్తున్నారని విమర్శించాము. అయితే ఈ విషయంలో కూడ సంక్షోభ పరిష్కారానికి ఏమీ చేయకపోయినా ఆత్మహత్యలు చేసుకున్న వారికి ఉపశమనంగా జివో రూపంలో ప్రభుత్వం ఒక ఆదేశాన్ని జారీ చేసింది. దాని అమలు కోసం కృషి చేస్తే బాధిత కుటుంబాలకు కొంత న్యాయం చేయగలుగుతాం అని చాలాసార్లు అనుకున్నాము గానీ అది కూడ సరిగ్గా అమలు కాలేదు.

నిజానికి ఈ రెండు జివోల అమలు కోసం మనం కృషి చేసిన కొద్ది సందర్భాలలో (కరీంనగర్, మెదక్ జిల్లాలలో) మంచి ఫలితమే వచ్చింది. ఫలాన వారికి అన్యాయం జరిగింది, పునఃపరిశీలించి న్యాయం చేయమని మనం అధికారులను అడిగినప్పుడు అది రాజకీయ లక్ష్యంగల పైరవీ కాదని వారికి తెలుసును కాబట్టి కొంచెం శ్రద్ధపెట్టి స్పందిస్తున్నారు.

అయినప్పటికీ మనం ఈ కృషి ఎక్కువగా చేయకపోడానికి కారణం మన వైఖరులలో ఉంది. ప్రభుత్వం న్యాయం చేయదు, చేయలేదు అని ఎండగట్టడంలో ఉన్న ఉత్సాహం, చేయించుకోగలిగినప్పుడు ఆ ప్రయత్నం చేయడంలో ఉండడం లేదు. సాధ్యాసాధ్యాల విషయంలో అవాస్తవికమైన అంచనాలు ఉండనవసరం లేదు గానీ, అసలు ప్రయత్నం చేయడం పట్లనే ఉత్సాహం చూపించని వైఖరి మన కార్యరంగానికి తగదు. హక్కుల లేమిని వెలికితీయడం, వాటి వ్యవస్థీకరణ కోసం కృషి చేయడం, అందుకోసం జరిగే ఉద్యమాలకు

మద్దతునివ్వడం, వ్యవస్థీకరణను ప్రభుత్వం చేపట్టే స్థితి వచ్చినప్పుడు అది సమగ్రంగా జరిగేటట్టు చూడడం, ఆ తరువాత దాని సక్రమమైన అమలు కోసం కృషి చేయడం, దాని వక్రీకరణనూ తొలగింపు ప్రయత్నాలనూ నిరోధించడానికి కృషి చేయడం; ఇవన్నీ మన కర్తవ్యాలే. ఇందులో మొదటివాటి పట్ల ఉన్న ఉత్సాహం చివరి వాటి పట్ల లేకపోవడం మన వైఖరిలోని లోపమే. దానిని సవరించుకోవడం అవసరం. అయితే వివిధ అంశాలలో చట్టరూపం, లేక జివోల రూపం తీసుకున్న హక్కులను అమలు చేయించుకునే కృషికి కొంత అధ్యయనం, అవగాహన అవసరం. ఈ అవసరం వేరే సందర్భాలలో కూడ ఉంది కాబట్టి దీని గురించి విడిగా మాట్లాడుకుందాం.

సెజ్‌లు, కోస్టల్ కారిడార్, భారీ పరిమాణంలో ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులు, పెద్ద పెద్ద ఫైరింగ్ రేంజ్‌లు, జిల్లాకొకటి చొప్పున వెలుస్తున్న విమానాశ్రయాలు వగైరాలన్నీ విధ్వంసకర అభివృద్ధి విధానాలలో భాగమే. వీటి గురించి గడచిన మూడు నాలుగు సంవత్సరాలలో మనం చాలా పనే చేసాం. ఆ కృషి గురించి విధ్వంసం – విస్థాపన అనే శీర్షికన తరువాత చూద్దాం.

## 2. పోలీసు, జైళ్ల వ్యవస్థలు

పోలీసు అత్యాచారాలు, కాల్పులు, చిత్రహింసలు, లాకప్ హత్యల విషయంలో కొంత పనిచేస్తూ వున్నాము. నిజనిర్ధారణ చేయడం, బాధితులు ఆందోళన చేస్తే అందులో పాల్గొనడం జరుగుతూ వుంది. ప్రభుత్వం మొదట్లో ఒక మానవ హక్కుల కమిటీ, ఆ తరువాత మానవహక్కుల పరిరక్షణ చట్టం, 1993 కింద ఒక మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసిన తరువాత బాధితులు సిద్ధంగా ఉన్న సందర్భాలలో ఈ కమిటీ/కమిషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికీ, విచారణలో సమర్ధంగా పాల్గొనడానికీ వారికి తోడ్పడుతున్నాం. శ్రీకాకుళంలో జరిగిన ఒక కస్టడీ మరణం కేసులో అప్పటి రాష్ట్ర మానవహక్కుల కమిటీ నష్టపరిహారం ఇప్పించడం వెనుక మన కృషి ఉంది. ఈ కర్తవ్యం మరింత ఎక్కువగా నిర్వర్తించే అవకాశం ఉంది. అయితే హైదరాబాద్ నగర కమిటీ లేక హైదరాబాద్‌లో ఉన్న రాష్ట్ర కమిటీ బాధ్యుల సహకారం దీనికి చాలా అవసరం అవుతుంది. దీనిని పెంచుకోవాలి.

సుప్రీంకోర్టు డి.కె.బసు కేసులో అరెస్టు, విచారణల సందర్భంగా పోలీసులు అనుసరించవలసిన పద్ధతుల గురించి ప్రకటించిన మార్గదర్శక సూత్రాలు మేజిస్ట్రేట్‌లకు తెలియవలసిన అవసరం ఉంది కాబట్టి, ఈ సూత్రాలను కరపత్రం రూపంలో అచ్చువేసి జిల్లాలలో మేజిస్ట్రేట్‌లను కలిసి వారికి కరపత్రం ఇచ్చి మాట్లాడే కార్యక్రమాన్ని పెట్టుకొన్నాము. హైదరాబాద్ నగరంలోనూ కొన్ని జిల్లాల్లోనూ అమలయింది. సుప్రీంకోర్టు తీర్పులు చట్టంతో సమానం కాబట్టి వాటిలో ప్రజాస్వామిక హక్కులకు ఉపకరించే అంశాలు ఉన్నప్పుడు, అవి సమాజంలో ఎవరికి తెలియాలో వారికి తెలియజెప్పే కార్యక్రమం పెట్టుకోవడం ఉపయోగంగా ఉంటుంది. ఉదాహరణకు ఈ మధ్యనే సుప్రీంకోర్టు వైద్యశాలలలో రోగుల సమాచార హక్కు గురించి ఒక మంచి తీర్పు ఇచ్చింది. ఇబ్బడి ముబ్బడిగా విస్తరిస్తున్న కార్పొరేట్ ఆస్పత్రులలో రోగులకు ఆ హక్కు లేనేలేదు కాబట్టి ఆ ఆస్పత్రులలో రోగులకు, నిర్వాహకులకు కూడా ఆ తీర్పును తెలియజెప్పే ప్రచార కార్యక్రమం చేపడితే బాగుంటుంది. నిర్వాహకులకు హెచ్చరికగానూ ఉంటుంది. మనమిప్పుడు సమీక్ష జరుపుకుంటున్నాము కాబట్టి ఈ ఆలోచన ఆ తీర్పును గురించి తెలిసిన బాధ్యులకు సహితం ఎందుకు రాలేదా అన్న ప్రశ్న వేసుకోవాలి. సంస్థ ఏర్పడిన తొలి దినాలలో తీసుకున్న కొన్ని సృజనాత్మకమైన నిర్ణయాలు రొటీన్‌లో పడిపోయిన తర్వాత మనకు స్ఫురించకుండ పోతున్నాయేమో ఆలోచించుకోవాలి. పని ఎక్కువ చేయడం, కార్యరంగాన్ని విస్తరించడం ఎంత ముఖ్యమో సృజనాత్మకతను కోల్పోకుండా ఉండడం కూడా అంతే ముఖ్యం.

'ఎన్‌కౌంటర్ల' విషయంలో మొదట్లో ఒక నిర్ణయం తీసుకున్నాము. ప్రతీ ఘటన గురించీ ఎపిసిఎల్‌సి మిత్రులూ మనమూ పోటాపోటీగా నిజ నిర్ధారణ చేయడం అనవసరం అని భావించాము. నిరాయుధులయిన సాధారణ గ్రామస్తులను చంపిన ఘటనలమీద, నక్సలైట్లు కాక 'కిరాయి హంతకులు' 'బందిపోట్లు' మొదలయిన పేర్లమీద పోలీసులు ఎన్‌కౌంటర్ హత్యలు చేసిన ఘటనల మీద దృష్టి పెట్టాము. తెలుగుదేశం పాలనలో కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ ఫ్యాక్షనిస్టులకు కాల్బలంగా పని చేసిన బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులను ఎన్‌కౌంటర్ పేరిట వరుసబెట్టి హతమార్చిన ఘటనల గురించి నిజనిర్ధారణ చేయడమే కాక ఆ హంతక విధానాన్ని విమర్శిస్తూ బహిరంగ సభ నిర్వహించాము. విజయవాడలో కస్టడీలో చంపి ఎన్‌కౌంటర్ జరిగిందని ప్రకటించిన రెండు ఉదంతాలలోనూ బెజవాడ బార్ అసోసియేషన్‌తోనూ ఎపిసిఎల్‌సి ఒపిడిఆర్‌లతోనూ కలిసి ఆందోళనలో పాల్గొన్నాము.

అయితే కొంతకాలం తరువాత ఎపిసిఎల్‌సి వారు తెలంగాణ జిల్లాలలో పనిచేయలేని పరిస్థితి నెలకొనింది. అప్పటినుండి అన్ని 'ఎన్‌కౌంటర్ల' విషయంలోనూ నిజనిర్ధారణ చేయడం మొదలుపెట్టాము. ప్రత్యేకించి 2005 జనవరిలో 'చర్చ'ల వైఫల్యం తరువాత 'ఎన్‌కౌంటర్లు' పెరిగిన నేపథ్యంలో ఈ కృషి కూడ పెరిగింది. అప్పటి నుండి నల్లమల అడవుల లోపలి ప్రాంతాలలో జరిగిన కొన్ని ఘటనలు తప్ప అన్నిటిమీదా నిజనిర్ధారణ చేసాము. రాష్ట్ర హైకోర్టు ఫుల్‌బెంచి 'ఎన్‌కౌంటర్ల' గురించి ఇచ్చిన తప్పుడు తీర్పును విమర్శిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కరపత్రం వేసి చాలా చోట్ల నిరసన సభలు జరిపాము.

2004లో కాంగ్రెస్‌పార్టీ అధికారానికి వచ్చినతరువాత నక్సలైట్లతో చర్చల ప్రక్రియను ప్రారంభించింది. ఈ నిర్ణయం వెనుక కమిటీ ఆఫ్ కన్సర్న్‌డ్ సిటిజెన్స్ (సిసిసి) కృషి చాలా ఉంది. అందులో మన సంస్థ సభ్యులయిన జీవన్‌కుమార్, కోదండరాం చురుగ్గా పాల్గొన్నారు. చర్చలు మొదలయిన తరువాత మధ్యవర్తుల కమిటీలో మనల్ని ఉండమని ఇరుపక్షాలూ కోరినప్పటికీ అది ప్రాథమికంగా రాజకీయ ప్రక్రియ కాబట్టి మనం ఒప్పుకోలేదు. అయితే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పర్యవేక్షించే కమిటీలో భాగస్వాములమయ్యాము. చర్చల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వమే అర్థాంతరంగా నిలిపివేసినప్పుడు విమర్శించాము.

బషీర్‌బాగ్ కాల్పులు (2000), ముదిగొండ కాల్పులు (2007), మక్కా మసీదు కాల్పులు (2007) ఈ పది సంవత్సరాలలో జరిగిన ప్రధానమైన పోలీసు కాల్పుల సంఘటనలు. మనం మూడింటిమీదా నిజనిర్ధారణ చేసాము. బషీర్‌బాగ్ కాల్పుల గురించి బాధితులయిన సిపిఐ, సిపిఐ (ఎం)ల సహకారంతో ఇద్దరు రిటైర్డ్ హైకోర్టు జడ్జిలచేత ప్రజా విచారణ జరిపించాము. దానికి మంచి స్పందన వచ్చింది. మక్కా మసీదు కాల్పులు మసీదులో పేలుళ్ల తరువాత జరిగాయి. అదే సంవత్సరంలో గోకుల్ చాట్, లుంబినీ పార్కులలో పేలుళ్లు జరిగి చాలామంది అమాయక ప్రజలు చనిపోయారు. ఆ రకమైన విచ్చలవిడి హింసాకాండకు ఎవరు ఏ కారణంగా పాల్పడినా దానిని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలనడంలో మనకు ఎటువంటి సందేహంగానీ సంకోచంగానీ లేదు. అయితే ఈ పేలుళ్ల పరిశోధన పేరు మీద హైదరాబాద్ నగర పోలీసులు చేసిన విచ్చలవిడి అరెస్టులు అంతే ఖండించదగ్గవి. నిర్దిష్టమయిన అభియోగమేమీ లేకుండ, భారతదేశంలో మతఘర్షణలు రెచ్చగొడుతున్నారనీ ఏవో క్యాసెట్లు దొరికాయనీ అంటూ 64 మందిని జైలుకు పంపారు. అందరినీ తీవ్రంగా చిత్రహింసలకు గురిచేసారు. నిర్బంధకాండపైన మనం నిజనిర్ధారణ జరిపి ఖండించాము. దీనిపైన వివరమైన రిపోర్టు 9వ బులెటిన్‌లో ప్రచురించాము. ఈ 64 మందినీ కోర్టులు నిర్దోషులుగా ప్రకటించి విడుదల చేయడం ఈ ఘోరానికి కొసమెరుపు.

గ్రీన్ టైగర్స్, కోబ్రాలు మొదలయిన పేర్లతో రాష్ట్రంలో హంతక ముఠాలు భయోత్పాతం కల్గించిన విషయం తెలిసిందే. పోలీసుల ప్రోత్సాహంతో జరిగిన ఈ హింసాకాండను మనం మొదటినుండి ఖండిస్తూ కూడ ఈ ముఠాలు విహరిస్తున్న జిల్లాలలోనూ మన కార్యక్రమాలు నిర్వహించగలిగాము. మన రాష్ట్ర అధ్యక్షునికి, ప్రకాశం జిల్లా కమిటీ బాధ్యునికి తరచుగా బెదిరింపు ఫోన్లు వస్తున్నప్పటికీ పోలీసు హింసాకాండతోబాటు ఇతర హక్కుల సమస్యల గురించి ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారు పని చేస్తూనే ఉన్నారు. ఈ ముఠాలకు ప్రధాన కేంద్రమయిన నల్గొండ జిల్లాలోనే మన మొదటి రాష్ట్ర మహాసభలు జరుపుకొన్నాము. ఈ ముఠాల హింసాకాండను అరికట్టడంలో ప్రభుత్వ వైఫల్యం ఉద్దేశ్య పూర్వకమయిన నిర్వ్యాపకత్వం అన్న అభియోగంతో కన్నబిరాన్ గారి సలహా మేరకు రాష్ట్ర లోకాయుక్తలో విరసం నాయకుడు చలసాని ప్రసాద్ గారు వేసిన కేసును నడిపించే బాధ్యత మనపైన వేసుకొని సాక్షులనూ, బాధితులనూ తీసుకొచ్చి వారి వాంగ్మూలాలు నమోదు చేయించాము. అయితే కేసు విచారణ ఇంకా ప్రాథమిక దశలో ('మెయింటెయినబిలిటీ'ని నిర్ణయించే దశలో) ఉండగానే లోకాయుక్తగా జస్టిస్ రామానుజంగారి స్థానంలో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేని జస్టిస్ ఆనందరెడ్డిగారు బాధ్యతలు చేపట్టడంతో ఆ కేసు ముందుకు సాగే అవకాశం ప్రస్తుతానికి కనిపించడం లేదు.

ఖైదీల హక్కుల విషయంలో మాత్రం మనం చేసింది స్వల్పమే. తరచుగా జరుగుతున్న ఖైదీల మరణాలలో జైలు వ్యవస్థ, పోలీసు వ్యవస్థల పాత్ర ఎంత అనే నిర్ధారణ చేయడం చాలా అవసరం. అయితే మరణాలొక్కటే కాదు. ఖైదీలను హక్కులుగల మనుషులుగా చూడడానికి నిరాకరించే వైఖరి జైలు యంత్రాంగంలోనే కాక సమాజంలోనూ, నేర విచారణ వ్యవస్థలోనూ కూడ బలంగా నెలకొని ఉండడంవల్ల అనేక రూపాలలో ఖైదీలు తమ హక్కులు కోల్పోతున్నారు. ఈ విషయంలో మనం మన కృషిని చాలా మెరుగు పరచుకోవలసి ఉంది. విషయ సేకరణలోని ఇబ్బంది కారణంగా ఏం చేయాలో పాలుపోక ఊరుకుంటున్నట్టున్నాము. సమాచారం ఇవ్వగల ఖైదీలను కలవడం కష్టం, వారి కుటుంబ సభ్యులను వెతికి పట్టుకోవడం ఇంకా కష్టం. అయినప్పటికీ దీనికి కావలసిన ఓపిక అలవరచుకున్నట్టయితే ఈ రంగంలో కృషి సాధ్యమే.

దీర్ఘకాలం జైలులో ఉన్న ఖైదీల ముందస్తు విడుదల కోసం ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు సంక్షోభంలోపడి, విడుదల కావలసి ఉన్న వందల మంది ఖైదీలు జైలులోనే ఉండిపోయిన సందర్భంలో నగర కమిటీ కన్వీనర్ చొరవతో కొందరు ఖైదీల కుటుంబాలను, ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని కొంత ఆందోళన చేసాం. ప్రభుత్వ ఆదేశాలను వ్యతిరేకిస్తూ తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీకి అనుకూలమైన మీడియా చేసిన అల్లరి ఖైదీల హక్కుల గురించి, ముందస్తు విడుదల విషయంలో రాజ్యాంగం గవర్నర్‌కు ఇచ్చిన అధికారం గురించి, దాని నిమిత్తం జైలు నియమావళి రూపొందించిన మార్గదర్శకాల గురించి ఏమీ తెలియని అజ్ఞానం నుండి పుట్టినదని విమర్శించాం. హైదరాబాద్‌లోనే కాక వరంగల్, రాజమండ్రి, విశాఖపట్నం, కడప, విజయవాడలలో మన చొరవతో ధర్నాలు జరిగాయి.

## 3. కుల వివక్ష, దాడులు

దళితులపైన భౌతిక దాడులు జరిగిన సందర్భాలలో నిజనిర్ధారణ చేయడం, బాధితులు గానీ దళిత సంఘాలుగానీ చేపట్టే ఆందోళనలలో పాల్గొనడం, పోలీసులచేత కేసు సక్రమంగా నమోదు చేయించడం, ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసు నమోదయ్యేటట్టు చూడడం, ఆ చట్టం కింద బాధితులకు రావలసిన నష్టపరిహారం ఇప్పించడానికి కృషి చేయడం – మన దృష్టికి వచ్చిన ఘటనలకు సంబంధించి ఈ పని మనం ఏదో ఒక మేరకు చేస్తున్నాం. మనకు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ దళిత సంఘాలతో స్నేహ సంబంధాలు ఉన్న కారణంగా దాడులకు గురయ్యే దళిత బాధితులు తరచుగా మన దగ్గరకు వస్తున్నారు. అయితే ఈ కృషి అన్ని జిల్లాలలోనూ ఒకే మేరకు జరగడం లేదు. దాడుల ఘటనలు అన్నీ మన దృష్టికి రావు కాబట్టి మనం స్పందిస్తాం అన్న విశ్వాసం దళిత వర్గాలలో కల్గించడం ముఖ్యం. కల్గించలేకపోతున్న చోట ఇది ఎందుకు జరుగుతున్నదో మనం ఆలోచించుకోవాలి.

కర్నూలులో ఈ రంగంలో మన కృషి ఎక్కువ విరివిగాను, ఒక పద్ధతి ప్రకారంగాను జరుగుతున్నది. ఆ జిల్లా కమిటీ తాను చేపట్టిన సమస్యలను తరచుగా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ దృష్టికీ రాష్ట్ర ఎస్‌సిఎస్‌టి కమిషన్ దృష్టికీ తీసుకుపోతున్నది. కానీ ఆ సంస్థలలో ప్రభుత్వం చేస్తున్న నియామకాలు వాటి బాధ్యతలకు తగినట్టు లేకపోవడం వల్ల ఫలితం ఎక్కువ ఉండడం లేదు. అయితే పైన చెప్పినట్టు హైదరాబాద్‌లోని నగర కమిటీ బాధ్యులు గానీ రాష్ట్ర కమిటీ బాధ్యులుగానీ ఈ కమిషన్‌లకు మన జిల్లా కమిటీలు పంపించే ఫిర్యాదుల 'ఫాలో–అప్' చేసే బాధ్యత నిర్వర్తిస్తే తప్ప నియామకాలు బాగున్నా కూడా మనం ఫలితం చూడలేకపోవచ్చు.

ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం అమలు కోసం మనం కృషి చేసిన క్రమంలో దాని పట్ల పోలీసు యంత్రాంగంలోను మొత్తంగా అధికార యంత్రాంగంలోను ఉన్న వ్యతిరేక వైఖరి మనకు అనుభవంలోకి వచ్చింది. న్యాయస్థానాలు కూడ దానిని నీరుగార్చే పద్ధతిలో వ్యాఖ్యానించాయి (ఇందులో మన రాష్ట్ర హైకోర్టుది ప్రముఖ పాత్ర). మరొక వైపు ఆ చట్టం దుర్వినియోగం అవుతున్నదంటూ అగ్రకుల శక్తులు పెద్దెత్తున ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అసలా చట్టం వినియోగమవుతున్నదా, ఎంత మేరకు అవుతున్నది అన్న చర్చ పెడుతూ ప్రచార కార్యక్రమం చేపట్టాలని ఈ మధ్యలోనే నిర్ణయం తీసుకున్నాము. ఎన్నికల కారణంగా ఆ నిర్ణయం అమలు ఆలస్యం అయింది. మన 3వ రాష్ట్ర మహాసభలు, దానికి ముందు జరిగే జిల్లా మహాసభల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలి.

ఎస్‌సి ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం అమలు తీరు మీద నివేదిక ఇమ్మని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ పున్నయ్య కమిషన్ ముందు హాజరయి మన సూచనలు వివరంగా ఇచ్చాము. (ఆ సూచనలను మొదటి బులెటిన్‌లో అచ్చు వేసాము) జస్టిస్ పున్నయ్యగారు వివిధ జిల్లాలలో నిర్వహించిన బహిరంగ విచారణలలో కొన్నిచోట్ల పాల్గొన్నాము. వారి నివేదికను విమర్శనాత్మకంగా సమీక్షిస్తూ 5వ బులెటిన్‌లో వ్యాసం రాసాము. ఆ నివేదికలో ఉన్న సూచనలే స్వల్పమంటే అవికూడ అమలు కాలేదు. వాటి అమలు కోసం ఆ తరువాత ప్రత్యేకమైన కృషి ఏదీ చేయకపోవడం మన లోపమే.

విద్యారంగంలో రిజర్వేషన్లు గత పది సంవత్సరాల కాలంలో తరచుగా చర్చకు వచ్చాయి. ప్రైవేట్ విద్యాసంస్థలు రిజర్వేషన్లు ఇవ్వనక్కరలేదన్న సుప్రీంకోర్టు తీర్పునూ, ఉన్నత విద్యా సంస్థలలో రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ అగ్రకులాలు చేసిన ఆందోళననూ విమర్శిస్తూ కరపత్రాలు వేసి చాలా చోట్ల మీటింగ్‌లు పెట్టాము. సుప్రీంకోర్టు తీర్పు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం బలంగా ముందుకొస్తున్న డిమాండ్‌కు పెద్ద ఆటంకం కాగలదు. కాగా రిజర్వేషన్ హక్కు రాబోయే రోజులలో న్యాయస్థానాలలో 'రాజ్యాంగ సంక్షోభానికి' దారితీసే అవకాశాలున్నాయి. 1970ల దాకా భూ సంస్కరణ చట్టాల నేపథ్యంలో 'ఆస్తిహక్కు' విషయంలో ఇది జరిగింది. ఇప్పుడు, మొత్తం రిజర్వేషన్ 50 శాతం మించవచ్చా అన్న ప్రశ్న అటువంటి సంక్షోభానికే దారితీసే పరిస్థితులు ఉన్నాయి. అగ్రకుల శక్తులు రిజర్వేషన్ల విషయంలో తాము లేవదీసే అభ్యంతరాలను ఏ రోజూ కేవలం కోర్టులకు పరిమితం చేయలేదు. ఆందోళనలూ కోర్టు కేసులూ సమాంతరంగా నడిపారు. సామాజిక న్యాయానికి అండగా నిలబడే శక్తులే ఈ విషయంలో వెనుకబడి ఉన్నాయి. '50 శాతం గరిష్ఠ పరిమితి'కి సంబంధించిన న్యాయపోరాటం రాబోయే రోజులలో మొదలుకానుంది. ఆ సందర్భంగా న్యాయస్థానాలలో ఒక సంస్థగా మన పాత్ర ఎంత ఉండగలదో చెప్పలేము గానీ ఆందోళనలో సముచిత పాత్ర నిర్వహించాలి. సమాజంలో వెనుకబాటుతనం ఎంత ఉంటే, దానిని అధిగమించడానికొక సాధనంగా రూపొందించిన రిజర్వేషన్లు కూడ అంత ఉండాలే తప్ప ముందుగానే వాటికి ఒక గరిష్ఠ పరిమితి నిర్ణయించడానికి వీలు లేదన్న వాదనను మనం బలంగా సమాజంలో చర్చకు పెట్టాలి. దీనికి కావలసిన అవగాహన మన సభ్యులలో పెంపొందించుకోవాలి. మన సభ్యులలో ఎక్కువమంది సామాజికంగా బలహీన వర్గాలకు చెందినవారు కావడంవల్ల వైఖరి విషయంలో సమస్యేమీ లేదు గానీ ఎదుటి పక్షం వాదనలు ఎదుర్కొనడానికి కావలసిన తాత్విక స్పష్టత అలవరచుకోవడం అవసరం.

ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ డిమాండు న్యాయమైనదన్న వైఖరి మనం మొదటినుండి తీసుకున్నాం. ఎస్‌టి రిజర్వేషన్‌ను కూడ, ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉండే తెగలు, ప్రధానంగా మైదాన ప్రాంతంలో ఉండే తెగలు అన్న ప్రాతిపదికన వర్గీకరించాలన్న డిమాండు ఏజెన్సీ ప్రాంత ఆదివాసులనుండి ఇప్పుడిప్పుడే వస్తున్నది. దానికి మనం అండగా మాట్లాడుతున్నాం. అటువంటి వర్గీకరణ

రాజ్యాంగ విరుద్ధం అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విమర్శిస్తూ బులెటిన్‌లో వ్యాసం రాసాము. నిజానికి ఆ తీర్పే పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. కాని తప్పయినా ఒప్పయినా అది సుప్రీంకోర్టు తీర్పు కాబట్టి ఇప్పుడు రాజ్యాంగాన్ని సవరించడం తప్ప వేరే మార్గం లేదు. ఈ విషయం మనం కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఉషా మెహరా కమిషన్‌కు సూచించాము. ఈ కర్తవ్యానికి జరగవలసిన కృషి క్లిష్టమైనది. అయినా వర్గీకరణ ఉద్యమం దీనిపైన దృష్టి పెట్టడం లేదని మనము సహితం విసుగు చెంది ఊరుకోవడం సరయినది కాదు.

విడివిడిగా కుల వివక్షకూ ఆధిపత్యానికీ సంబంధించిన సమస్యల గురించి పని చేయడమే కాక మొత్తంగా వర్ణ ధర్మ భావజాలానికీ దానికి ప్రధాన సంస్థారూపం అయిన ఆర్ఎస్ఎస్ ప్రభావం వ్యాప్తికీ వ్యతిరేకంగా కొంత కృషి చేస్తున్నాం. 2002లో గుజరాత్‌లోనూ, 2008లో ఒరిస్సా, కర్నాటక రాష్ట్రాలలోనూ ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు మైనారిటీలపైన చేసిన హింసాత్మక దాడుల గురించి వివరంగా నిజనిర్ధారణ చేసి నివేదికలు అచ్చువేసాము, కొన్ని చోట్ల మీటింగ్‌లు పెట్టాము. ఆర్ఎస్ఎస్ వల్ల ప్రమాదం కేవలం మైనారిటీలకే కాదనీ, మానవీయమైన సమాజం మనుగడకే అది ప్రమాదకారి అనీ మనం గుర్తించాము. అయితే ఈ విషయంలో కార్యకర్తలలో అవగాహన పెంపొందించడం అవసరం. మన రాష్ట్రంలోనూ కరీంనగర్ జిల్లా మైదాన ప్రాంతాలలో, ఖమ్మం ఆదిలాబాద్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలలో క్రైస్తవుల పట్ల వ్యతిరేకత రెచ్చగొట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి.

## 4. ఆదివాసులు

ఒక సామాజిక వర్గంగా మనం ఈ పది సంవత్సరాల కాలంలో ఎక్కువగా అండగా నిలబడింది ఆదివాసీ ప్రజలకేనని చెప్పుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ సంఘాలు మనల్ని తమ మిత్రులుగా గుర్తిస్తున్నాయి. మన సహాయం తీసుకుంటున్నాయి. ఏజెన్సీ ప్రాంతాలలో మన సభ్యత్వం కూడ ఇప్పుడిప్పుడు పెరుగుతున్నది. 1998, 99 సంవత్సరాలలో ఆదిలాబాద్, విశాఖపట్నం జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసులు వేల సంఖ్యలో రోగాల బారినపడి చనిపోయినప్పటి నుండి ఏజెన్సీ ప్రాంతాలలో రోగాలు, వాటికి గల కారణాలు గురించి మనం విషయ సేకరణ చేస్తూనే ఉన్నాం, మన అభిప్రాయం ప్రచారం చేస్తూనే ఉన్నాం. 'ఆదివాసీ ప్రాంతంలో రోగులు డాక్టర్ దగ్గరకు రారు, డాక్టరే రోగి దగ్గరికి పోవాలి' అన్న సూత్రాన్ని ప్రభుత్వం గుర్తించి దానికి తగిన వైద్యవ్యవస్థను రూపొందించాలని ప్రచారం చేస్తున్నాం. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి ప్రభుత్వం నియమించిన కె.ఆర్. వేణుగోపాల్ కమిటీకి సహకరించడమే కాక వారి నివేదిక సారాంశాన్ని కరపత్రంగా అచ్చువేసి ప్రచారం చేసాము. తన వైఫల్యానికి పరిష్కారంగా ఏజెన్సీ ప్రాంతాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఇప్పుడు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయోగం ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో మొదలుపెట్టింది. ఈ బాధ్యతారాహిత్యం వల్ల రాగల సమస్యలను వివరిస్తూ ఆదిలాబాద్ జిల్లాలో ప్రకటన ఇచ్చాము. ఈ ప్రయోగం ఇతర ఏజెన్సీ ప్రాంతాలకూ వ్యాపించే ప్రమాదం ఉంది.

విశాఖపట్నం జిల్లా వాకపల్లి గ్రామంలో ఆదివాసీ మహిళలపైన గ్రేహౌండ్స్ సిబ్బంది అత్యాచారం జరిపినపుడు దానికి వ్యతిరేకంగా బాధిత మహిళలు చేపట్టిన ఆందోళనలో మనం మొదటినుండి పాల్గొన్నాం. వారికి కోర్టులో న్యాయ సహాయం కూడ అందిస్తున్నాం.

వేల సంఖ్యలో ఆదివాసులను నిర్వాసితులు చేస్తున్న పోలవరం ప్రాజెక్టును చేపట్టే ప్రయత్నం మళ్లీ మొదలయిన తరువాత మొదట మనమే ముంపుకు గురికాబోయే ప్రాంతాలలో పర్యటించి వివరమైన నివేదిక అచ్చువేసాము. ఆ ప్రాజెక్టును రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న ఆదివాసీ సంఘాలతో కలిసి పని చేస్తున్నాం. ప్రస్తుతం స్తబ్దంగా ఉన్న పోలవరం–వ్యతిరేక ఆందోళనను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నాం. విశాఖపట్నం ఏజెన్సీలో బాక్సైట్ మైనింగ్‌ను కూడ ఆదివాసుల ప్రయోజనాల కోణం నుండి, నీటివనరుల విధ్వంసం కోణం నుండి వ్యతిరేకిస్తున్నాం. బాక్సైట్ వ్యతిరేక ఆందోళనలలో పాల్గొంటున్నాం. ఖమ్మం జిల్లాలో సింగరేణి యాజమాన్యం చేపడుతున్న ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు కూడ దాదాపు అన్నీ ఏజెన్సీ ప్రాంతంలోనే ఉన్నాయి. ఆదివాసులకు జరగగల తీవ్ర నష్టాన్ని గురించి ప్రచార యాత్ర చేపట్టి వివరించాము.

ఈ కృషి మనం మరింత సమర్థంగా చేయాలంటే ఏజెన్సీ ప్రాంతాలలో కార్యకర్తలు (ఆదివాసులయినా కాకపోయినా) అవసరం. ఆదిలాబాద్, ఖమ్మం, విశాఖపట్నం జిల్లాలలో ఈ మధ్యనే మన నిర్మాణాన్ని ఏజెన్సీ ప్రాంతానికి విస్తరించగలుగుతున్నాం.

ఏజెన్సీ ప్రాంతాలలోనే కాక బయట కూడ ఆదివాసీ ప్రజల హక్కుల కోసం పని చేస్తున్నాం. నెల్లూరు జిల్లా పడమటి ప్రాంతంలో పోలీసు వేధింపులకు గురవుతున్న యానాదులకు, నల్గొండ జిల్లాలో ఫీల్డ్‌ఫైరింగ్ రేంజ్ వల్ల కష్టపడి బాగుచేసుకున్న భూములు పోతాయని ఆందోళన చెందుతున్న లంబాడాలకు మొదటినుండి అండగా ఉంటున్నాం.

ఆదివాసులు పెద్దసంఖ్యలో నివసిస్తున్నప్పటికీ ఏజెన్సీలో చేర్చని ప్రాంతాలు మన రాష్ట్రంలో చాలా ఉన్నాయి. దీనికి సంబంధించి రాష్ట్రప్రభుత్వమే తయారు చేసిన ఒక సవరణ ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం ముందు రెండు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉంది. అది సమగ్రమైన ప్రతిపాదన కాకపోయినా కనీసం అదయినా ఆమోదం పొందాలని డిమాండ్ చేస్తున్నాం. దీనికోసం రాష్ట్రంలో చురుకుగా పనిచేస్తున్న అయిదవ షెడ్యూలు సాధన కమిటీ ఉద్యమంలో భాగస్వాములుగా ఉన్నాం.

ఛత్తీస్‌గడ్‌లో సల్వాజుడుం దాడుల కారణంగా మన రాష్ట్రానికి 40 నుండి 50 వేల మంది గొత్తికోయలు పారిపోయి వచ్చారు. ప్రధానంగా ఖమ్మం జిల్లాలోను కొంత వరంగల్ జిల్లాలోను ఉంటున్నారు. అడవిలో కొంత స్థలం చూసుకొని చెట్లుకొట్టి గుడిసెలు వేసుకొని బతుకుతున్నారు. పోడు కొడితే అటవీశాఖ కోపగిస్తుందని భయపడి చుట్టుపక్కల గ్రామాలలో కూలి చేసుకొని బతుకుతున్నారు. వాళ్లకు కనీసం తెల్లకార్డులు, ఉపాధి హామీ కార్డులు, వాళ్లు వేసుకున్న ఇళ్ల దగ్గర బోర్లు కల్పించాలని మనం మూడేళ్లుగా కృషి చేస్తున్నాం. ప్రభుత్వ అధికార్లు వెంటనే హామీ యిచ్చినా కూడ అటవీశాఖ, పోలీసు శాఖల వ్యతిరేకత కారణంగా అది అమలు కావడం లేదు. దొడ్డిదారిన వారిలో కొందరు రేషన్ కార్డులు తెచ్చుకున్నారు తప్ప అధికారికంగా వారికి ఆ కనీస వసతి కూడ దక్కలేదు. మొన్నటి ఎన్నికలలో వారికి ఛత్తీస్‌గడ్‌లోగానీ మన రాష్ట్రంలో గానీ ఓటు హక్కు దక్కలేదు. ఈ మధ్య కొన్ని స్వచ్ఛంద సంస్థలు వారి కోసం పని చేస్తున్నాయి. వాళ్ల పిల్లలకు హిందీ మాధ్యమంలో బ్రిడ్జిస్కూళ్లు పెట్టించగలిగారు. ఛత్తీస్‌గడ్‌కు చెందిన వనవాసి చేతన ఆశ్రమం అనే స్వచ్ఛంద సంస్థ వాళ్లను తిరిగి తమ గ్రామాలకు తీసుకుపోయేందుకు కృషి చేస్తున్నది. ఈ మొత్తం కృషికి అండగా ఏర్పడిన సంఘీభావ కమిటీలో మనం చురుకుగా పాల్గొంటున్నాము.

అయితే ఆదివాసుల హక్కుల గురించి పనిచేసే విషయంలో మనకు అసంతృప్తి కలిగించేది ఏమిటంటే ఏజెన్సీలోనూ అడవి ప్రాంతాలలోనూ ఉన్న ఆదివాసులకు హక్కులు కల్పించే బలమైన చట్టాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయించుకోలేకపోతున్నాం. ముఖ్యంగా స్వయంపాలన దిశగా ఆదివాసీ గ్రామాలకు హక్కులు కల్పించే 'పెసా' చట్టం కాగితాలకే పరిమితమయింది. దానికి జీవం కల్పించే ప్రయత్నం మన ఒక్కరివల్ల అయ్యేది కాదుగానీ ఆదివాసీ సంఘాలు, ఇతర ప్రజాతంత్ర సంస్థలు కలిసినట్టయితే ఆ దిశగా కార్యక్రమం తీసుకోవచ్చు. ఆదివాసీ సంఘాలు (ఒకనాడు పేరుపొందిన తుడుందెబ్బ వంటి సంస్థలతో సహా) బలహీనంగా ఉండడం వల్ల మనం ఎక్కువ చేయలేకపోతున్నాము. ఏజెన్సీ ప్రాంతాలలో కార్యకర్తలను సంపాదించుకొని మనమే కార్యక్రమాలు రూపొందించుకున్నట్టయితే కదలిక వస్తుందేమో చూడాలి.

## 5. మహిళలు

దళితులలాగ మహిళల విషయంలో కూడ హింసకు, దాడికి గురయిన వారు మన దగ్గరకు వచ్చినా లేక వారి సమస్యను ఎవరయినా మన దగ్గరికి తీసుకొచ్చినా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇప్పించడం, పోలీసులు కేసును సీరియస్‌గా తీసుకునేటట్టు ఒత్తిడిపెట్టడం చేస్తున్నాము. అయితే దళితులు, దళిత సంఘాలు ఒక మేరకు మనల్ని తమకు అండగా ఉండే సంస్థగా గుర్తించి మన సహాయం తీసుకొంటున్నారు గానీ మహిళల విషయంలో ఆ పరిస్థితి లేదు. ఒక్క కడప జిల్లా కమిటీ కన్వీనర్ మాత్రమే తన ప్రాంతంలో సంస్థకు ఆ గుర్తింపు తెచ్చిపెట్టారని చెప్పవచ్చు. మరికొన్ని జిల్లా కమిటీలలో మహిళలను బాధ్యులుగా తీసుకుంటే తప్ప ఈ పరిస్థితి మెరుగుపడేటట్టు లేదు.

గృహహింస చట్టం ఒక మంచి ప్రయోగం. ఈ మధ్యకాలంలో సామాజిక స్వభావంగల చట్టాలను తయారు చేసేటప్పుడు ఆయా రంగాలలో పనిచేస్తున్న కార్యకర్తలను, ఉద్యమకారులను సంప్రదించి చట్టాలు రూపొందించే సదాచారం కేంద్ర ప్రభుత్వం పాటిస్తున్నది. ఆ విధంగా సంప్రదించబడే వారి అభిప్రాయాలనూ సూచనలనూ ప్రభుత్వం చివరికి కుదించడం జరుగుతుంది కాబట్టి వారికి ఆ వచ్చిన చట్టం సంతృప్తినివ్వదు. అది సహజమే. అయినప్పటికీ ప్రభుత్వ అధికారులే తమ కార్యాలయాలలో కూర్చొని రూపొందించే చట్టాలకంటె ఇవి మెరుగ్గానే ఉంటాయి. అయితే సంస్కరణాత్మకమైన ఏ చట్టమయినా సంకుచిత భావాలకు నిలయాలయిన అధికార యంత్రాంగం, న్యాయస్థానాలు పెట్టే ఆటంకాలను అధిగమించి బతికినప్పుడే మేలు చేయగలుగుతాయి. వాళ్ల చేతుల్లో అవి కుదింపబడకుండా ఉండాలంటే ఆ చట్టంలోని ప్రగతిశీల అంశం గురించి నిరంతరాయంగా చర్చ జరగాలి. అది మన మీద ఉన్న ఒక ముఖ్య బాధ్యత.

మనం గృహహింసచట్టాన్ని వివరిస్తూ ఒక కరపత్రం వేసి రాష్ట్రవ్యాప్తంగా పంచాము. అయితే ఆ చట్టం అమలులోకి వచ్చి దాదాపు మూడేళ్లు అవుతోంది కాబట్టి అది అమలులో ఎదుర్కొంటున్న అవాంతరాలను, దుర్వ్యాఖ్యలను పరిశీలించి మరొక దఫా చర్చ చేపట్టాలి.

ప్రేమ పేరుమీద అమ్మాయిలపైన జరుగుతున్న హింస మన సమాజంలో ఈమధ్యకాలంలో తీవ్ర రూపం తీసుకుంటున్న అణచివేత. ఈ ఘటనలు జరిగినప్పుడు ముందుకొచ్చిన ఆందోళనలలో మనమూ పాల్గొంటున్నాం. అదే సమయంలో నేరాలకు పాల్పడిన వారిని ఉరి తీయాలనీ వారి కేసులు లాయర్లెవరూ చేయకూడదనీ ఆవేశపరులు ఇస్తున్న నినాదాలను వ్యతిరేకిస్తున్నాం. ఈ దాడులకు సంబంధించిన వివిధ పార్శ్వాలను చర్చించే ఒక వ్యాసాన్ని 9వ బులెటిన్‌లో ప్రచురించాము. ఆ వెలుగులో ఈ ఘటనలకు మనం ఎప్పటికప్పుడు స్పందించాలి. ఈ హింసపట్ల స్త్రీలలోనేకాక సర్వత్రా వ్యతిరేకత ఉంది కాబట్టి మనం తగిన ప్రచార రూపం ఎంచుకున్నట్టయితే వీటిని నివారించే దిశగా సమాజంలో సంకల్పం పెంచే అవకాశం ఉంది. పని స్థలాలలో స్త్రీలు ఎదుర్కొనే లైంగిక వేధింపులను నిరోధించే ఉద్దేశ్యంతో సుప్రీంకోర్టు 'విశాఖ' కేసులో ఇచ్చిన తీర్పును, అందులో సూచించిన ఫిర్యాదుల కమిటీల ఏర్పాటును వివరిస్తూ కరపత్రం వేసి ప్రభుత్వ కార్యాలయాలలో పంచడమేకాక అధికార్లతో ఆ చట్టం అమలు గురించి చర్చించాము కూడ. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో

అమలయింది. ఆ తరువాత విజయవాడలో శ్రీలక్ష్మి అనే విద్యార్థినిని ప్రేమ పేరిట వేధించి హతమార్చిన సందర్భంగా, కళాశాలల యాజమాన్యాలను కలిసి సుప్రీంకోర్టు ఆదేశించిన కమిటీల ఏర్పాటు గురించి చర్చించాము.

మనం కులవివక్ష, అణచివేతల విషయంలో పనిచేసేటప్పుడు దళిత సంఘాలతో కలిసి పనిచేస్తున్నాం. ఆదివాసుల సమస్యల గురించి పని చేసేటప్పుడు ఆదివాసీ సంఘాలతో కలిసి పనిచేస్తున్నాం. దళిత ఉద్యమం, ఆదివాసీ ఉద్యమం ఈ మధ్య బలహీనపడ్డాయి గానీ మహిళా ఉద్యమం మాత్రం ఎప్పుడూ బలహీనంగానే ఉంది. అందువల్ల మనమీద మరింత ఎక్కువ భారం ఉందని గుర్తించి పనిచేయాలి. ఆ స్పృహ మనలో ఉందా అంటే నూటికి తొంభై శాతం లేదనే చెప్పాలి.

## 6. ఉపాధిహామీ, సమాచార హక్కు చట్టాలు

ప్రజోపయోగకరమైన చట్టాల సక్రమ అమలు కూడ మన కర్తవ్యాలలో ఒకటి. ఈమధ్యకాలంలో దేశ పాలకులు గర్వంగా చెప్పుకుంటున్న చట్టాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం.

మనం సమాచార హక్కు చట్టాన్ని వివరిస్తూ మొదట్లోనే కరపత్రం వేసాము. ఒకటి రెండు చోట్ల దాని స్వభావాన్ని వివరిస్తూ మీటింగ్‌లు పెట్టాము. ఆ చట్టాన్ని మనం వాడుకోవడమే కాక మన సహాయం కోరిన వారికి కూడ దానిని వాడుకునే పద్ధతి నేర్పిస్తున్నాము. శ్రీకాకుళం జిల్లాశాఖ ఈ విషయంలో ముందుంది. ఇప్పటిదాకా ఈ చట్టం అమలు విషయంలో మన అనుభవం ఏమిటంటే ఆయా ప్రభుత్వశాఖల అవినీతిని బయటపెట్టే సమాచారం కాకపోతే సకాలంలో ఇచ్చేస్తున్నారు. వారి అవినీతినిగానీ వేరే ఏదయినా అనుచితమైన నడవడికనుగానీ బయటపెట్టగల సమాచారం అయితే మాత్రం ఏదో ఒక సాకు చెప్పి నిరాకరించడం, సాగదీయడం జరుగుతున్నది. కింది స్థాయి సమాచార అధికారి నిరాకరించినదానిపైన అతని శాఖాధిపతికి అప్పీల్ చేసుకొన్నా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. వాళ్లు (ఎక్కువగా) తోడుదొంగలుగానే వ్యవహరిస్తున్నారు. ఆపైన బ్యూరోక్రసీలో భాగంకాని రాష్ట్ర, జాతీయ సమాచార హక్కుల కమిషన్‌లకు రెండవ అప్పీల్ వేసుకునే ఓపిక ఉంటే అడిగిన సమాచారం మామూలుగానయితే దక్కాలి. ఎందుకంటే ఆ స్థాయిలోని సమాచార కమిషనర్లు ప్రభుత్వ యంత్రాంగంలో భాగం కాదు. అయితే కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర ప్రవృత్తిగల వ్యక్తులను నియమిస్తుండగా మన రాష్ట్రంలో కాంగ్రెస్ బ్రాండు మనుషులను నియమిస్తుండడం వల్ల, వారికి సమాచార హక్కుకు ప్రజాస్వామ్య సంస్కృతిలో ఉండగల ప్రాముఖ్యాన్ని గురించిన స్పృహ కొరవడడంవల్ల, తరచుగా ఆ స్థాయిలోనూ ప్రయోజనం దక్కడం లేదు. ఇంకా ఓపిక ఉండి హైకోర్టుకు పోతే పెద్దగా ఇబ్బంది లేకుండ సమాచారం ఇచ్చేయమన్న ఆదేశం లభిస్తున్నది. (అయితే జడ్జిల ఆదాయాలు, ఆస్తుల సమాచారం కోరినట్టయితే న్యాయస్థానాలు కూడా సహకరించకపోవచ్చునని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వైఖరి తెలుపుతుంది!).

అయితే సగటు పౌరులు ఇన్ని దశలలో ప్రయత్నాలు చేయలేరు. మొదటి దశలోనే అంటే సమాచార అధికారి దగ్గరే సమాచారం లభించాలి. ఇవ్వని అధికారి జీతంనుండి (అర్జీ పెట్టిన 30 రోజుల తరువాతి దినం నుండి) రోజుకు 250 రూపాయల జుర్మానా వసూలు చేయబడుతుందని చట్టం అంటోంది. ఇది నిజంగా అమలయితే దొరకవలసిన చోటే సమాచారం దొరుకుతుంది. మనం ఈ పరిహారం తప్పనిసరిగా అమలు కావాలని ఆందోళన చేయడం అవసరం.

ఉపాధిహామీ పథకం చట్టం అమలు గురించి మనం కొన్ని జిల్లాలలో అడపాదడపా సర్వే జరిపాము. ఆ పథకం భూమిలేని పేదలకు మేలు చేసినమాట సత్యమేగానీ ఇప్పటికీ దానినొక హక్కుగా కాక ప్రభుత్వం దయగానే ప్రజలకు చూపిస్తున్నారు. సంవత్సరానికి 100 దినాల పనికి చట్టం హామీ ఇస్తుండగా సగటున 30 రోజులు మించి పని ఇవ్వడం లేదు. పని ఇవ్వని దినాలకు నిరుద్యోగభృతి ఎక్కడా ఇవ్వడం లేదు. అవినీతి చాలా ఉంటున్నది. అవినీతిలేని చోట కూడ చేసిన పనికి వేతనం చాలా ఆలస్యంగా ఇస్తుండడంవల్ల ప్రజలకు ఈ పథకం నుండి ప్రయోజనం పొందాలన్న ఉత్సాహం పోతున్నది.

ఈ లోపాలను సోదాహరణంగా వెలికి తీసి సంబంధిత అధికార్లకు ఫిర్యాదు చేయడం, కరపత్రాలు వగైరా రూపాలలో ప్రచారం చేయడం, బాధిత ప్రజలచేత తమ హక్కులు అడిగించడం మనం చేయగల పనులు. అయితే అప్పుడప్పుడు తప్ప ఈ విషయంలో మనం స్పందించడం లేదు. ఉపాధిహామీ పథకం అమలును పర్యవేక్షించే కమిటీలో మన సభ్యులు జీవన్‌కుమార్, కోదండరాం ఉన్నారు. మనం గమనించిన లోపాలను నిర్దిష్టమైన సమాచారంతో వారికి తెలియజేసినా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ విషయాలు అనేక పర్యాయాలు తెలియజేసినప్పటికీ భూమిలేని పేదలకు పనిహక్కు కల్పించే చట్టం సక్రమ అమలు కోసం మనం చేయగల కృషి విషయంలో ఉండవలసిన స్పందన ఉండడం లేదు.

## 7. తెలంగాణ ప్రాంత హక్కులు

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలుగా తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు గుర్తింపు ఉంది. ప్రాంతీయ వివక్ష, ప్రాంతీయ హక్కులు అన్న చర్చ మూడు ప్రాంతాలలోనూ ఉంది. అయితే ఒక బలమైన రాజకీయ డిమాండుగా తెలంగాణ నుండి ఇది ముందుకు రావడం వల్ల సహజంగానే తెలంగాణను కేంద్రం చేసుకొని ఈ చర్చ జరుగుతున్నది.

తెలంగాణ విద్యా ఉద్యోగ విషయాలలోనూ, భాషా సంస్కృతుల విషయంలోనూ నిరాదరణకు, వివక్షకూ గురయింది. భూసారం, నీరు, అడవులు, బొగ్గు తదితర వనరులు చెప్పుకోదగ్గ మోతాదులో ఉండి కూడ వ్యవసాయ పారిశ్రామిక ప్రగతిని ఆ దామాషాలో పొందలేదు. ఈ వనరులు ఇతర ప్రాంతాల అభివృద్ధికి దోహదపడినంతగా తెలంగాణ అభివృదికి తోడ్పడడం లేదు. 50 సంవత్సరాల అనుభవం తరువాత ఈ అసమానతలు, వివక్ష తొలగిపోతాయన్న దాఖలాలు లేనప్పుడు ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేయడం న్యాయమైన రాజకీయ కోరిక అని మనం మొదటినుండి అభిప్రాయపడుతున్నాం. ఈ విషయంలో ఇతర ప్రాంతాల వారికి అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో ప్రొఫెసర్ జయశంకర్ గారిచేత విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం పట్టణాలలో మాట్లాడించాము. జివో 610 అమలు చేయాలన్నది న్యాయమైన  డిమాండని వివరిస్తూ కరపత్రం వేసి రాష్ట్ర వ్యాపితంగా పంచడమేకాక విశాఖపట్నం, విజయవాడలలో బహిరంగ సభలు నిర్వహించాం.

తెలంగాణలో దుర్భిక్షం తీవ్రంగా ఉన్న కాలాలలో కరువు ప్రాంతాలలో పర్యటించి నీటివనరులను నిర్లక్ష్యం చేయడం ఈ దుస్థితికి కారణం అని వివరించాం. అకస్మాత్తుగా వర్షాలు కురిసినప్పుడు చెరువుల కట్టలు తెగి నీళ్లు నిలువకుండ పోయినప్పుడు కూడ చక్కటి చెరువుల వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్ల జరిగిన నష్టాన్ని ఎత్తిచూపాము. ఈ విమర్శ తెలంగాణకే కాక చిన్న నీటివనరులపైన ఆధారపడ్డ దుర్భిక్ష ప్రాంతాలన్నిటికీ వర్తిస్తుంది. రాయలసీమ దక్షిణాంధ్ర జిల్లాలలో కూడ ఇటువంటి విషయసేకరణ, విమర్శ చేసాము. ఈ సందర్భంగా చెరువుల నిర్వహణను ఆయకట్టుదార్లకే అప్పగించడానికని ఉద్దేశించిన రాష్ట్ర చట్టం అమలుకాకుండ ఉన్న వైనాన్ని విమర్శించాము.

పులిచింతల, పోలవరం ప్రాజెక్టులు తెలంగాణ ప్రయోజనాలకు (పోలవరమైతే ఆదివాసీ ప్రయోజనాలకు కూడ) నష్టకరం అన్ని విమర్శను మొదటినుండి పెడుతున్నాం. ఈ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలలో పాల్గొంటున్నాం.

సింగరేణి యాజమాన్యం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతితో భారీగా చేపడుతున్న ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులు ఉత్తర తెలంగాణకు చాలా నష్టకరం అన్న ఆందోళన మనమే మొదలు పెట్టాము. సంబంధిత గ్రామాలు తిరిగి విషయ సేకరణ చేయడమే కాక ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆదిలాబాద్ నుండి ఖమ్మం దాకా ప్రచార యాత్ర చేపట్టాము.

దుర్భిక్ష ప్రాంతాలయిన దక్షిణ తెలంగాణ, రాయలసీమలకు సాగునీరివ్వాలంటే కృష్ణా నదీజలాల పునఃపంపిణీ చేయాలన్న డిమాండుతో ఇతర సంఘాలను కలుపుకొని పునఃపంపిణీ కోసం ప్రచార ఉద్యమం చేపట్టాము. ధర్నాలు, సభలు నిర్వహించాము. జలయజ్ఞం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం నదీజలాల ప్రాజెక్టులను ప్రకటించినప్పుడు మహబూబ్‌నగర్ జిల్లాలో రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్.డీ.ఎస్) ఆధునీకరణ, జూరాలను పూర్తి సామర్థ్యంతో నిర్మించడం, ఆదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగ  ప్రాజెక్టు చేపట్టడం, ఈ యజ్ఞంలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నిస్తూ కరపత్రం వేసాము. దానితోపాటు అనంతపురం జిల్లాకు అత్యవసరమైన తుంగభద్ర సమాంతర కాలవ అందులో లేకపోవడం ఏమిటని,  ఒరిస్సాతో నీటి ఒప్పందాలు కుదుర్చుకోకుండ ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు ప్రకటించి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించాం.

కృష్ణానది మిగులు జలాల మీద ఎనిమిది ప్రాజెక్టులు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటికోసం నీటి హక్కులు అడగం అని రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్‌కు హామీ ఇచ్చిరావడం మొత్తంగా రాష్ట్రంలో కృష్ణానది ఎగువన ఉన్న దుర్భిక్ష ప్రాంతాలకు అన్యాయం అని విమర్శించాం. ఈ ఎనిమిది ప్రాజెక్టుల నీటి హక్కుల భద్రతకూ ఒకే ప్రాధాన్యం ఇవ్వకుండ, అందులో ముఖ్యమంత్రి స్వంత జిల్లాకు నీళ్లిచ్చే తెలుగుగంగ, గండికోట ప్రాజెక్టుల నీటి హక్కులను మాత్రం దృష్టిలో ఉంచుకొని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచడాన్ని వివక్ష అని విమర్శించాం. దీనివల్ల వివక్షకు గురయ్యేది దక్షిణ తెలంగాణ జిల్లాలే కాదు, రాయలసీమలోని అనంతపురం, కర్నూలు జిల్లాలు కూడ.

## 8. ప్రజారోగ్యం

ఏజెన్సీ ప్రాంతాలలో వర్షాకాలంలో అతిసార, మలేరియా వంటి వ్యాధులు సోకి ప్రజలు పెద్దెత్తున రోగగ్రస్తులవుతున్న వైనాన్నీ ఆ విషయంలో మనం మొదటినుండి చేస్తున్న కృషినీ పైన ('ఆదివాసులు' సెక్షన్‌లో) వివరించాము. ఇవి నిజానికి నివారించగల రోగాలు. తగినంత పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, శుభ్రమైన మంచినీళ్లు అందరికీ అందేటట్టు చూస్తే ఇంత పెద్దెత్తున రోగాలు వచ్చే ప్రసక్తే లేదు. ఆపైన ఆదివాసీ ప్రాంతాలకు తగిన వైద్య వ్యవస్థను ప్రవేశపెడితే సమర్థమైన వైద్యం జరుగుతుంది. ఈ విషయాలు మనతో సహా ఎంతో మంది ప్రభుత్వానికి చెప్పినప్పటికీ ఆ దిశగా ఎటువంటి చర్యలూ లేవు.

మరొకవైపు కేవలం ఏజెన్సీ ప్రాంతాలలోనే కాక రాష్ట్రమంతటా ప్రజారోగ్య వ్యవస్థను నిర్లక్ష్యం చేసారు. వాటిలోని  సేవలు అధ్వాన్నంగా తయారయి, దీనికంటే ప్రైవేట్ వైద్యవ్యవస్థే మేలు అన్న మాట ప్రజలే అనే స్థితి తీసుకొచ్చారు. అది జరిగిన కొద్దీ కార్పొరేట్ ఆస్పత్రుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. ఏ కొద్దిపాటి ఆస్తి ఉన్నవారయినా ఉన్నదంతా అమ్ముకొని ప్రాణాన్నీ ఆరోగ్యాన్నీ

కాపాడుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఇప్పుడు దీనికి విరుగుడుగా 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వం ఖర్చుతో కార్పొరేట్ ఆస్పత్రుల బిజినెస్ పెంచుతున్నారు. అదే ఖర్చు పెట్టి ప్రభుత్వ ఆస్పత్రులను బాగుచేస్తే అందరికీ రివాజుగా ఉచిత వైద్యసేవలు లభిస్తాయి కదా అన్న విమర్శకు ప్రభుత్వం వద్ద జవాబు లేదు.

అదట్లాగుంచి, 'ఆరోగ్యశ్రీ' కింద వైద్యం చేయించుకున్నవారు చాలామంది గ్రామానికి తిరిగి వచ్చిన తరువాత చనిపోతున్నారని కరీంనగర్ జిల్లా నుండి వార్తలు రాగా ఆ జిల్లాలో పర్యటించాము. 'ఆరోగ్యశ్రీ'కి పేషెంట్లను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు రికమెండ్ చేసే పద్ధతి కాక, కార్పొరేట్ ఆస్పత్రుల ప్రతినిధి ఒకరు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులలో కూర్చొని పేషెంట్లను ఎంపిక చేయడం, ఆ ఆస్పత్రులు జిల్లాలో క్యాంపులు నిర్వహించి పేషెంట్లను తీసుకుపోవడం జరుగుతున్నది. ఒక్కొక్క రోగానికి ప్రభుత్వం ఎంత మంజూరు చేస్తుందో దానికే వైద్యాన్ని కుదించడంవల్ల ఆపరేషన్‌అనంతర సేవలు సరిగ్గా లభించడం లేదు. త్వరగా ఇంటికి పంపుతున్నవారికి మళ్లీ ఆరోగ్యం చెడినట్టయితే అదే ఆస్పత్రికి తిరిగి వెళ్లినా ప్రభుత్వం ఇచ్చిన మొత్తం అయిపోయింది కాబట్టి ఇంక ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ స్థితి మీద మనం వివరమైన నివేదిక పత్రికలకు ఇచ్చాము. కొన్ని పత్రికలు ఆ తరువాత తమ కథనాలు కూడా రాసాయి. ఇది కేవలం కరీంనగర్ జిల్లా ప్రత్యేకత అయి ఉండే అవకాశం లేదు కాబట్టి ఇతర జిల్లా కమిటీలు కూడా 'ఆరోగ్యశ్రీ' పేషెంట్ల తదుపరి స్థితి గురించి రిపోర్టు సేకరించాలని అనుకున్నాం. సమాచారం లభ్యంకాని కారణంగానో ఏమో వేరే ఏ జిల్లా నుండి రిపోర్టులు అందలేదు. భవిష్యత్తులో దీని పైన దృష్టి పెట్టి సమాచారం సేకరించాలి.

హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న భోలక్‌పూర్ ప్రాంతంలో కలుషిత నీరుతాగి తీవ్ర అనారోగ్యం పాలయి చాలా మంది చనిపోయిన వార్త రాష్ట్రంలో సంచలనం కలిగించింది. కానీ ఇది హైదరాబాద్ నగరంలోని మురికివాడలలో ఎక్కడయినా ఎప్పుడయినా జరిగి ఉండవచ్చు. ఉండగలదు. నగరంలో మంచినీటి కాలవలు, మురుగు నీటి కాలవలు నేల కింద పక్కపక్కనే పోతుంటాయి. వాటి మధ్య దూరం ఇరుకు ప్రాంతాలలో చట్టం నిర్దేశించిన దానిలో 10వ వంతు కూడా లేదు. పైప్‌లైన్లు తుప్పుపట్టిపోయినా, చిల్లులు పడినా పట్టించుకోరు. మురుగునీటి శాఖలో సిబ్బంది తక్కువ. కాంట్రాక్ట్ లేబర్‌తో పనిచేయించుకుంటారు. మురుగునీటి కాలవలు నిండిపోయినా వారాల తరబడి శుభ్రం చేయరు. భోలక్‌పూర్‌లో అదనంగా ఉన్నదేమిటంటే అశుభ్రమైన వ్యర్థ పదార్థాలను విసర్జించే తోళ్ల ప్రాసెసింగ్ సంస్థలు. అక్కడి జనాభాలో వీటి యజమానులే ధనవంతులు కాబట్టి వారి మాట ఇతరులు కాదనరు. వారి నిర్లక్ష్యం, వీరి అశుభ్రం కలసి నీటిని కలుషితం చేసినాయి. అక్కడి ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. చివరకి మంచినీటిలో మురుగు మోతాదు పెరిగి ప్రాణాలు పోయాయి.

మనం ఈ వివరాలన్నీ సేకరించి పత్రికలకు విడుదల చేసాము. నగరంలో పారిశుధ్యం గురించి ఆందోళన చేయడానికి జనవిజ్ఞాన వేదిక వారి చొరవతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.ఆర్.వేణుగోపాల్ గారిని కన్వీనర్‌గా గల ఒక వేదిక ఏర్పడింది. దానిలో మనం కూడా చేరి పనిచేస్తున్నాం.

## 9. ముస్లిం రిజర్వేషన్లు

ముస్లింలకు మన రాష్ట్రంలో విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం గడచిన పది సంవత్సరాల్లో ఇప్పటికి మూడు సార్లు జరిగింది. మొదటి రెండు సార్లు ఈ ప్రయత్నం హైకోర్టులో ఓడిపోయింది. మూడవ ప్రయత్నం కూడా కోర్టు ముందుకు పోయింది. వాదనలు అయిపోయాయి, తీర్పు ఏ రోజయినా రాగలదు.

మనం ఈ రిజర్వేషన్లను వ్యతిరేకించే వారికి సమాధానం చెప్తూ ఒక వివరమైన కరపత్రం వేసి చాలా చోట్ల సభలు నిర్వహించాము. ముస్లిం సంస్థలు నిర్వహించిన సదస్సులు, సభలలో పాల్గొన్నాము. మొదటిసారి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను కొట్టేసిన హైకోర్టు, బిసి కమిషన్‌ను సంప్రదించకుండ ఏ వెనుకబడిన వర్గానికీ రిజర్వేషన్ ఇవ్వకూడదని సుప్రీం కోర్టు ఆదేశించిన విషయాన్ని ఉటంకించింది. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం రిజర్వేషన్ ప్రతిపాదనను బిసి కమిషన్ ముందు ఉంచింది. మనము బిసి కమిషన్ నిర్వహించిన విచరణకు హాజరయి, కమిషన్ ఏ కోణంలో విషయ సేకరణ చేస్తే న్యాయస్థానాలలో నిలబడే నిర్ధారణ సాధ్యమవుతుందో వివరించాము. అయితే బిసి కమిషన్ నివేదికను రెండవసారి జరిగిన వ్యాజ్యంలో హైకోర్టు అసమగ్రమైనదిగా ప్రకటించి ప్రభుత్వ ఆదేశాన్ని తిరస్కరించింది. విషయం మళ్లీ బిసి కమిషన్ ముందుకు పోయింది. మనం మళ్లీ వారు నిర్వహించిన విచారణకు హాజరయి అదే సూచన చేసాము. ఈసారి వారి నివేదికను హైకోర్టు అంగీకరిస్తుందో లేదో చూడాలి. రిజర్వేషన్ల పట్ల న్యాయస్థానాలలో నెలకొన్న వ్యతిరేక వైఖరి ఒకవైపు, తనకు అప్పగించిన పని సమర్థంగా నిర్వర్తించాలన్న సంకల్పం కన్నా ప్రభుత్వం ఇమ్మన్న తేదీకి నివేదిక ఇచ్చేసి ముఖ్యమంత్రిని మెప్పించాలన్న ఆరాటమే ఎక్కువగా ఉన్న బిసి కమిషన్ బాధ్యతారాహిత్యం మరొక వైపు ముస్లింలకు పదేపదే అన్యాయం చేస్తున్నాయి.

సమగ్రమైన నివేదిక ఏ విధంగా ఉండగలదన్న దానికి చక్కటి ఉదాహరణ సచార్ కమిటీ నివేదిక. మన సోదర సంస్థ అయిన పియుసిఎల్ జాతీయ అధ్యక్షునిగా (ఒకప్పుడు) ఉండిన రాజిందర్ సచార్ గారి నేతృత్వంలోని కమిటీ ప్రధాన మంత్రి కోరిక మేరకు

దేశంలోని ముస్లింల స్థితిగతులు గురించి వివరమైన విషయ సేకరణ అన్ని కోణాలలోను జరిపి తయారు చేసిన నివేదిక అది. దాని సారాంశాన్ని మనం 9వ బులెటన్‌లో ప్రచురించాము. 'సచార్ కమిటీ సూచనలు అమలు చేయాలి' అని చాలామంది ఒక డిమాండ్ పెడుతున్నారు గానీ, ఆ నివేదికలో సూచనలే బలహీనమైనవి. అంతకంటె గట్టి డిమాండ్లు పెట్టగల సమాచారం సచార్ కమిటీ నివేదికలో ఉంది. ముస్లింలు మొత్తంగా తీసుకున్నప్పుడు హిందూ అగ్రకులాలకంటేనే కాదు, బిసిల కంటే కూడా అధ్వాన్నమైన స్థితిలో ఉన్నారనీ చాలా విషయాలలో ఎస్‌సిలతో సమానంగా ఉన్నారనీ ఆ నివేదిక తెలుపుతుంది. ఆ నివేదిక నుండి సరయిన డిమాండ్లు రూపొందించి ప్రభుత్వం ముందు పెట్టే బాధ్యత చేపట్టవలసి ఉంది.

## 10. అభివృద్ధి పేరిట విధ్వంసం – విస్థాపన

మనం మన పరిధిలోకి వచ్చే అనేక విషయాల మీద ఎంతో కొంత కృషి చేసిన విషయం పై వాక్యాలు తెలుపుతాయి. అయితే మనం ఎక్కువ దృష్టి పెట్టిన ఒక అంశాన్ని పేర్కొనాలంటే అది వికృతమైన, విధ్వంసకరమైన అభివృద్ధి గురించి, దాని పర్యవసానంగా జరిగిన, జరుగుతున్న, లక్షలాది ప్రజల బలవంతపు విస్థాపన గురించి అని చెప్పాలి.

వేగవంతమైన ఆర్థిక వృద్ధిరేటు సాధించడానికి వనరులను ఎటువంటి పరిమితులు లేకుండా పెట్టుబడిదార్ల చేతిలో పెట్టాలనీ, వారు కోరుకునే అన్ని వసతులూ మౌలిక సదుపాయాలూ కల్పించాలనీ, లాభార్జన బాగా ఉండడానికి కావలసిన రాయితీలన్నీ ఇవ్వాలనీ నమ్మే ఆర్థిక విధానం నుండి విధ్వంసకరమైన అభివృద్ధి పుట్టింది. దీని వివిధ రూపాల పైన మనం ఎప్పటికప్పుడు విమర్శ పెడుతూ బాధిత ప్రజానీకానికి సంఘటితం కావడానికి సలహాలు ఇస్తూ సంఘీభావం తెలుపుతూ ఉన్నాము.

సెజ్‌లు ఈ విధ్వంసానికి మారుపేరుగా గుర్తింపు పొందాయి. రాష్ట్రంలో సెజ్‌లు నెలకొల్పడం మొదలుపెట్టిన తొలి దశ నుండి మనం వ్యతిరేకిస్తున్నాం. సెజ్ అనేది 'అంతర్జాతీయ ప్రమాణాలుగల' మౌలిక సదుపాయాలు, వసతులు ఉన్న పారిశ్రామిక టౌన్‌షిప్. దాని వైశాల్యం 12500 ఎకరాల దాకా ఉండగలదు. అందులో పెట్టుబడులు పెట్టేవాళ్లకు సకల పన్ను రాయితీలతో బాటు నిరంతరాయంగా నీటి సరఫరా, కరెంటు సరఫరా వగైరాలకు ప్రభుత్వమే హామీ యిస్తుంది. అక్కడ పని చేసే కార్మికులకు చాలా హక్కులకు భరోసా ఉండదు. విశాఖపట్నం నుండి నెల్లూరు దాకా మనం ఈ వికృతమైన సృష్టిని ప్రజలకు విడమరచి చెప్పి దానికి భూములు ఇవ్వడానికి నిరాకరించే వారికి అండగా ఉంటున్నాం. కాకినాడ సెజ్ వ్యతిరేక ఆందోళనలో మన పాత్ర మొదటినుండి ఉంది. పోలేపల్లి సెజ్ వ్యతిరేక ఆందోళనలోనూ ఉంది. సెజ్‌ల గురించి హైదరాబాద్‌లో సెమినార్ నిర్వహించాము. ఆ సందర్భంగా వివరమైన కరపత్రం అచ్చువేసి రాష్ట్రమంతటా పంచాము. సెజ్ వ్యతిరేక ఆందోళనకారులు ఆయా ప్రాంతాలలో నిర్వహించిన సభలలోనూ నిరసన కార్యక్రమాలలోనూ పాల్గొంటున్నాం.

కోస్టల్ కారిడార్ అనేది అనేక సెజ్‌లు, ఓడరేవులు, థర్మల్ కేంద్రాలు, విమానాశ్రయాల సమాహారం. నెల్లూరు నుండి శ్రీకాకుళం దాకా ప్రతిపాదిత కోస్టల్ కారిడార్ ఏర్పడినట్టయితే దాదాపు 4 లక్షల ఎకరాల భూమి ప్రజలకు కాకుండ పోతుంది. రైతులు, వివిధ కులవృత్తులవారు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు తమ జీవనాధారాన్ని భారీగా కోల్పోతారు. దీనికి వ్యతిరేకంగా మనం నిరంతరాయంగా ప్రచారం జరుపుతున్నాం. ఉత్తరాంధ్రలో ఇతర సంఘాలతో కలిసి ప్రచార యాత్ర నిర్వహించాము. మధ్య కోస్తాలోని వాన్‌పిక్ ప్రాంతంలో మనమే ప్రచారయాత్ర చేపట్టాము.

సింగరేణి బొగ్గుగని కంపెనీ యాజమాన్యం ఆదిలాబాద్ నుండి ఖమ్మం జిల్లా దాకా (ఆపైన పశ్చిమగోదావరి జిల్లాలో కూడ) ప్రతిపాదించిన 72 ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులు పూర్తి చేసినట్టయితే ఎంతలేదన్నా 2 లక్షల ఎకరాల భూమి క్వారీలకూ మట్టి గుట్టలకూ పోతుంది. చుట్టుపక్కల విపరీతమైన కాలుష్యం కూడ ఉంటుంది. అండర్‌గ్రౌండ్ బొగ్గు బావుల ద్వారా బొగ్గు తీసినట్టయితే కంపెనీకి కొంత ఖర్చు ఎక్కువ కావచ్చును గానీ ప్రజల జీవితాలు ఇంతగా ధ్వంసం కావు. దీనికి వ్యతిరేకంగా మనం ఆదిలాబాద్‌లో వరంగల్‌లో అనేక సభలు, ధర్నాలు నిర్వహించాము. ఆ చివరి నుండి ఈ చివరిదాకా ప్రచార యాత్ర నిర్వహించాము. ఓపెన్‌కాస్ట్‌లను వ్యతిరేకించే కమిటీలు గ్రామాలలో ఏర్పడడానికి సహకరించాము.

విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసులు చేస్తున్న ఆందోళనలోనూ ఆ తవ్వకాలకు అనుబంధంగా కొండ కింది ప్రాంతంలో రిఫైనరీ కోసం జరుగుతున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు జరుపుతున్న ఆందోళనలోనూ మన భాగస్వామ్యం ఉంది.

ఈ విధ్వంసకరమైన అభివృద్ధి ప్రక్రియ ప్రత్యక్షంగా ప్రజల భూములనూ ఇతర వనరులనూ వారికి దూరం చేయడమే కాక పర్యావరణాన్ని ధ్వంసం చేయడం ద్వారా కూడ ప్రజల జీవనాన్ని దెబ్బతీస్తుంది. దేశంలోనే ఒక ప్రధాన థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారనున్న నెల్లూరు జిల్లాలో వ్యవసాయంపైన, మత్స్యకారుల జీవనంపైన, సాధారణ ప్రజారోగ్యంపైన ఉండగల కాలుష్య దుష్ప్రభావాన్ని

వివరించడానికి ఒక ప్రముఖ పర్యావరణవేత్త చేత లెక్చర్ ఇప్పించాము. రసాయన కాలుష్యానికి వ్యతిరేకంగా శ్రీకాకుళం జిల్లాలో బాధిత ప్రజల సంఘాలతో కలిసి పనిచేస్తున్నాం.

ఈ విధ్వంసాన్ని వ్యతిరేకించే అవగాహన, చైతన్యం ప్రజలకు కల్పించడంతో పాటు ఒకవేళ విస్థాపన తప్పనిసరయితే చట్టం వారికిచ్చిన హక్కులను తెలియజెప్పే పనికూడ పెట్టుకున్నాము. అన్ని వృత్తులవారికీ భూమిలేని వ్యవసాయ కూలీలకూ కూడ నష్టపరిహారం ఇస్తూ నిర్వాసిత గ్రామాన్ని గ్రామంగా మరొక చోట నెలకొల్పాలని ఆదేశించే జివో 68లోని రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానాన్ని రాష్ట్రమంతటా మనమే ప్రజలకు పరిచయం చేసాము. అసైన్‌మెంట్ భూములకు స్వంత భూములతో సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని చెప్పిన హైకోర్టు తీర్పును, రిజిస్ట్రేషన్ ధర చెల్లించాలని చెప్పే జివో 1307ను కూడ మనమే ప్రజలకు పరిచయం చేసాము. భూసేకరణ ప్రక్రియలను దానిలోని హక్కులను వివరిస్తూ 'ప్రభుత్వం మీ భూమికోసం వస్తే...' అనే చిన్న ప్రచురణ తీసుకొచ్చాము. అది బాగా ప్రచారం అయింది. జివో 68 అమలుకోసం మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్వాసితులతో కలిసి కరీంనగర్‌లో ధర్నా నిర్వహించిన సందర్భంగా ఆ జిల్లా కలెక్టర్‌ను కలవగా అర్థమయింది, ఐఎఎస్ ఆఫీసర్లకు సహితం మనం చెప్తే తప్ప ఆ పునరావాస విధానం గురించి తెలియదని!

అణువిద్యుత్ ప్రాజెక్టులు, అమెరికాతో భారత్ అణు ఒప్పందం కూడ ఈ విధ్వంసక అభివృద్ధి వ్యూహంలో భాగమే. మన రాష్ట్రంలో నల్గొండ జిల్లా దేవరకొండ ప్రాంతంలోనూ కడప జిల్లా పులివెందుల దగ్గరా యురేనియం నిక్షేపాలున్నాయి. వాటిని వెలికి తీసి పక్కనే శుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పాలన్న ఆలోచన గత తెలుగుదేశం ప్రభుత్వ కాలం నుండి ఉంది. నల్గొండలో స్థానిక ప్రజలలో కొందరిని కొంతకాలం ప్రభుత్వం మభ్యపెట్టగలిగినప్పటికీ చివరికి బలమైన వ్యతిరేకత నెలకొనింది. వివిధ ప్రజాసంఘాలతో కలిసి యురేనియం మైనింగ్‌కు, శుద్ధి కర్మాగారానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాల్గొంటున్నాం. వివరమైన కరపత్రం వేసి దానివల్ల రాగల విపత్తును, ప్రభుత్వం చెప్తున్న అబద్ధాలను ప్రజలకు తెలియజేసాము. పర్యావరణ బహిరంగ విచారణలో పాల్గొన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పులివెందులలో యురేనియం తవ్వకాల ప్రతిపాదన వచ్చింది. అక్కడ వ్యతిరేకించడానికి మనం తప్ప ఎవరూ లేరు. మనం బాధిత గ్రామాలలో ప్రజలతో వివరంగా మాట్లాడాము, కరపత్రం వేసి పంచాము. ప్రజలతోబాటు పర్యావరణ బహిరంగ విచారణలో పాల్గొన్నాము. అక్కడ ముఖ్యమంత్రి సోదరుడు ఎంపి హోదాలో స్టేజి ఎక్కి కూర్చుని బయటివారిని పోగుచేసి మనల్ని పేరు పెట్టి నిందిస్తూ వెనక్కి వెళ్లిపోవాలన్న నినాదాలు ఇప్పించాడు.

ఒక్క యురేనియం విషయంలోనే కాదు, చాలా ప్రాజెక్టుల పర్యావరణ విచారణలలో మనం పాల్గొంటున్నాం. మనం గమనిస్తున్నది ఏమిటంటే ఆ విచారణలు ఎందుకోసం అని ప్రజలకు తెలీదు. పర్యావరణ నివేదిక వారికి అర్థమయ్యే భాషలో అందుబాట్లో ఉంచరు. అధికారులు స్టేజి ఎక్కి ప్రాజెక్టువల్ల రాగల ప్రయోజనాలు ఏకరువు పెడతారు. జనం నష్టపరిహారం గురించి పునరావాసం గురించి అభ్యర్థిస్తారు. ఒకవేళ ఎవరయినా ప్రాజెక్టును వ్యతిరేకిస్తే వారిని దూషించడానికి గుంపును ముందే పోగుచేసి పెడతారు. ఒకవేళ జనం ముందుగానే చైతన్యవంతులయి ఉండి విచారణను బహిష్కరిస్తే, దానిని బలవంతంగా తూతూ మంత్రంగా జరిపి ముగిసిందనిపిస్తారు.

రాష్ట్రంలో అమలవుతున్న విధ్వంసక అభివృద్ధినీ దాని పర్యవసానాలనూ దానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచార, ఆందోళన కార్యక్రమాలను, అందులో మన పాత్రను వివరించే పద్ధతిలో 10వ బులెటిన్‌ను విస్థాపన, విధ్వంసాల స్పెషల్ బులెటిన్‌గా తీసుకొస్తున్నాము.

## 11. అమెరికా ఆధిపత్యవాదం

ఈ పది సంవత్సరాల కాలంలో అమెరికా రెండు దుర్మార్గమైన యుద్ధాలకు పాల్పడింది. మొదటిది ఆఫ్ఘనిస్తాన్‌పైన, రెండవది ఇరాక్‌పైన. రెండు యుద్ధాలనూ అబద్ధాలతో బుకాయింపుతో అమెరికా సమర్థించుకోవాలని చూసింది. ఆఫ్ఘనిస్తాన్ పాపం తనదేనన్న విషయం దాచిపెట్టింది. ఇరాక్ నేరం అవిధేయత తప్ప వేరే ఏమీ కాదన్న విషయమూ దాచి పెట్టింది. మన దేశ ప్రభుత్వం రెండు సందర్భాలలోనూ అమెరికా ఆధిపత్య వాదానికి సమర్థన ఇచ్చే వైఖరినే అవలంబించింది. మనం అమెరికా చేసిన దాడినీ మన పాలకుల వైఖరినీ కూడ విమర్శిస్తూ వివరంగా కరపత్రాలు వేసి చాలా ఊర్లలో బహిరంగ సభలు నిర్వహించాము. ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం నేపథ్యాన్ని వివరిస్తూ వివిధ పత్రికలలో వచ్చిన వ్యాసాలనూ వ్యాఖ్యలనూ అనువదించి, మన 4వ బులెటిన్‌ను 'యుద్ధసత్యాలు' అనే పేరిట ప్రత్యేక బులెటిన్‌గా తీసుకొచ్చాము.

భారత అమెరికా అణుఒప్పందం కూడ ఒక రకంగా ఈ నేపథ్యానికి చెందినదే. ఆసియాలో అమెరికా ఆధిపత్యవాదానికి బంటుగా ఇండియాను మలచుకునే రాజకీయ లక్ష్యంతో అమెరికా ఈ ఒప్పందానికి సుముఖంగా ఉండగా, మన పాలకులు అమెరికా భుజాలెక్కి కూర్చొని ప్రపంచాధిపత్యంలో వాటా పొందాలన్న ఆరాటంతో సుముఖంగా ఉన్నారు. ఆ ఒప్పందం వల్ల భారత్ విద్యుదుత్పత్తి సామర్థ్యానికి మేలు జరుగుతుందని మన పాలకులు చెప్తున్న మాటలు వట్టి అబద్ధాలు. ఈ విషయాలను వివరిస్తూ మనం కరపత్రం వేసి చాలాచోట్ల బహిరంగ సభలు నిర్వహించాము.

## 12. ఇతర రాష్ట్రాలు

2002లో గుజరాత్‌లో సంఘ్‌పరివార్ ఆధ్వర్యంలో ముస్లింల పైన జరిగిన ఊచకోత గురించి వివిధ హక్కుల సంఘాలతో కలిసి వారం రోజులకు పైగా నిజనిర్ధారణ చేసాము. ఇంగ్లిష్‌లో అప్పటికే చాలా నివేదికలు వచ్చిన కారణంగా వివరమైన రిపోర్టు తీసుకు రాలేదు గానీ తెలుగులో మన పేరుమీదనే వివరమయిన ప్రచురణ తీసుకొచ్చాము. చాలా చోట్ల మీటింగ్‌లు జరిపాము.

2008లో ఒరిస్సా, కర్నాటక రాష్టాలలో సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో క్రైస్తవుల పైన, క్రైస్తవ సంస్థల పైన హింసాత్మకమైన దాడులు జరిగిన సందర్భంగా మళ్లీ వివిధ హక్కుల సంఘాలను కలుపుకొని వివరంగా నిజనిర్ధారణ చేసాము. ఇంగ్లిష్‌లో ఉమ్మడి నివేదిక ఇప్పటికే అచ్చయింది. తెలుగు అనువాదం రాష్ట్ర మహాసభల లోపల తీసుకొస్తాము. కర్నాటకలో హిందుత్వవాద సంస్థల దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి కాబట్టి ఈ మధ్య జరిగిన ఘటనల వివరాలు కూడ అనువాదంలో చేర్చుతాము.

ఈ రెండు సందర్భాలలోనూ, సంఘ్ పరివార్ పైన పోరాటం కేవలం మైనారిటీల హక్కుల సమస్య కాదనీ దేశ సామాజిక రాజకీయ జీవితంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికీ కాపాడడానికీ చేస్తున్న పోరాటమనీ స్పష్టం చేసాము. దానికి తగినట్టే, ఒరిస్సా కర్నాటక హింసాకాండను విమర్శిస్తూ మనం హుజూరాబాద్‌లోనూ వరంగల్‌లోనూ జరిపిన సభలను సంఘ్‌పరివార్ శక్తులు భగ్నం చేయడానికి ప్రయత్నించారు.

2005లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సల్వాజుడుం ఆవిర్భవించిన తరువాత తీవ్ర రూపం తీసుకున్న హింసాకాండను గురించి అధ్యయనం చేయడానికి ఆ సంవత్సరం ఒకసారి, 2006లో ఒకసారి బాధిత ప్రాంతంలో పర్యటించాము. దానిమీద వివరమైన నివేదిక ఇంగ్లిష్‌లోనూ తెలుగులోనూ కూడా అచ్చువేసాం. సల్వాజుడుం దాడులకు తట్టుకోలేక మన ఖమ్మం జిల్లాలోకి పారిపోయివచ్చిన దాదాపు 40 వేల మంది గొత్తికోయలకు కనీసం నివాసం, ఉపాధి కల్పించడం కోసం మనం చేసిన ప్రయత్నాలను పైన వివరించాము. వారు తిరిగి తమ గ్రామాలకు వెళ్లి తమ భూములు సాగుచేసుకొని బతకగలగడం తక్షణ అవసరంగా భావించి, దీనికోసం ఆ రాష్ట్ర ప్రభుత్వంపైన, మావోయిస్టులపైన ఒత్తిడి తీసుకురాగల పౌర సమాజ బృందం ముందుకు రాగలదేమోనన్న ప్రయత్నంలో భాగంగా పలుమార్లు ఆ రాష్ట్రానికి పోయి వచ్చాము. ఆ ప్రయత్నం పెద్దగా ఫలించలేదు.

కాశ్మీర్‌లో అనంతంగా సాగుతున్న దమనకాండ గురించి రెండు మూడేళ్లకొకసారి ఆ రాష్ట్రంలో పర్యటించి సమాచారం సేకరించే పని 1991 నుండి దేశం లోని హక్కుల సంఘాలు చేస్తున్నాయి. మానవ హక్కుల వేదిక ఏర్పడిన తరువాత మనం నాలుగుసార్లు కాశ్మీర్‌కు పోయి నివేదికలు ప్రచురించాము.

2004లో మణిపూర్‌లో మనోరమ అనే స్త్రీని అస్సాం రైఫిల్స్ జవాన్లు రేప్ చేసి చంపారన్న అభియోగం నేపథ్యంలో కొంతమంది స్త్రీలు అస్సాం రైఫిల్స్ కేంద్రం ఎదుట తమను తాము వివస్త్రలు చేసుకొని మమ్మల్ని రేప్ చేయండి అంటూ నిరసన తెలిపిన ఉదంతం దేశంలో సంచలనం సృష్టించింది. అప్పుడు మనం మణిపూర్‌కు పోయి, తక్కువ సమయంలోనే వీలయినంత సమాచారం సేకరించి వివరమయిన నివేదిక ప్రచురించాము. సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టానికి వ్యతిరేకంగా మణిపూర్‌లో జరుగుతున్న ఆందోళన వీడియో చిత్రాన్ని విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, వరంగల్‌లలో ప్రదర్శించి సభలు జరిపాము.

ఒరిస్సాలో కళింగనగర్ కాల్పుల గురించి, జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో 'పాస్కో' ఉక్కు కార్మాగారానికి తమ భూములివ్వడాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజా ఉద్యమాన్ని గురించి నిజనిర్ధారణ జరిపాము. ఆ రాష్ట్రం దక్షిణ ప్రాంతంలో నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కొనే క్రమంలో పారామిలిటరీ బలగాలు పాల్పడుతున్న 'ఎన్‌కౌంటర్'లు, ఇతర అత్యాచారాల గురించి మనం రెండుసార్లు నిజనిర్ధారణ కమిటీ వేసాము. జార్ఖండ్ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలలో పరిశ్రమలకోసం జరుగుతున్న భారీ భూసేకరణకు స్థానిక ప్రజల నుండి గట్టి ప్రతిఘటన ఎదురవుతున్నదని తెలిసి ఆ ప్రాంతానికి 2008లో పోయి వచ్చాము. మరొకసారి పోయి వచ్చిన తరువాత వివరమైన నివేదిక ప్రచురిస్తాము. మన దగ్గర ఉద్యమాలకది మార్గదర్శకంగా ఉండవచ్చు.

# నిర్మాణం, ఉద్యమం, ఉద్యమరూపాలు

1998లో సంస్థ ఏర్పడినప్పుడు మనం 32 మందిమి. రెండు సంవత్సరాల క్రితం శ్రీకాకుళంలో 2వ రాష్ట్ర మహాసభలు జరుపుకునే నాటికి సంస్థ సభ్యత్వం 200 దాటింది. అయితే సంస్థ కార్యకలాపాలలో ఎంతో కొంత రెగ్యులర్‌గా భాగం పంచుకుంటున్న వారి సంఖ్య లెక్కపెడితే 80 నుండి 85 దాకా ఉంటుంది. అంటే సగటున జిల్లాకు నలుగురు అని అర్థం. ఆ సంఖ్యను 10 చేయగలిగితే – ఒక్కొక్క జిల్లాలో 10 మంది సంస్థ కార్యకలాపాలలో రెగ్యులర్‌గా నిమగ్నమయ్యే స్థితి తీసుకురాగలిగితే – మనం పెట్టుకున్న అజెండాకు ప్రాథమికంగా న్యాయం చేయగలుగుతాం. మనం పూనుకుంటే ఇది అసాధ్యం కాదు.

మొదట్లో కొంత కాలం కొత్త సభ్యత్వం చేయించవద్దనుకున్నాము. మన సంస్థ ఏర్పడిన నేపథ్యంవల్ల కలిగిన అపోహల కారణంగా ఆ నిర్ణయం అవసరం అయింది. మనం నక్సలైట్ – వ్యతిరేక వేదికగానో ప్రభుత్వ సంస్కరణలను ప్రచారం చేసే వేదికగానో ఉండబోతామన్న

అభిప్రాయం అప్పట్లో కొంత ఉండింది. మనమేమిటో స్పష్టం అయ్యేంత వరకు కొత్త సభ్యత్వం చేయించవద్దని అందుకే అనుకొన్నాం.

ముగ్గురు కన్వీనర్లతో మన ఉనికిని మొదలు పెట్టాము. వారు జీవన్ కుమార్, సునీత, మధుసూదనరాజు. అయితే త్వరలోనే సునీత, మధుసూదనరాజు మానేసారు. వారేకాదు మొదట్లో ఉన్న 32 మందిలో నాలుగవ వంతు వరకు మానుకున్నారు. వారిలో గుంటూరుకు చెందిన బి. చంద్రశేఖర్ ఒక్కడే తనకు తాత్విక విభేదాలు ఉన్నాయన్నాడు. అతనిని కార్యవర్గానికి వచ్చి అవేమిటో వివరించమనీ చర్చిద్దామనీ అడిగాము. కానీ అతను రాజీనామా చేసాడు. మిగిలిన వాళ్లెవ్వరూ విభేదాలున్నాయనలేదు. వేరే బాధ్యతలు, పనులు, వ్యాపకాలు ఉన్న కారణంగా రాలేకపోతున్నామని చెప్పారు. ఒకవేళ విభేదాలున్నా చర్చించడానికి ముందుకొస్తే తప్ప మనం చేయ గలిగింది లేదు.

ఈ లోపల మనం కార్యక్రమాలు చేపడుతూ, ప్రచురణలు తీసుకొస్తూ, కరపత్రాలు బహిరంగ సభల ద్వారా మనమేమిటో స్పష్టం చేస్తూ కొత్త సభ్యులను చేర్చుకోవడం మొదలుపెట్టాము. జిల్లా కమిటీలు వేసుకున్నాము. ప్రస్తుతం మహబూబ్‌నగర్, నిజామాబాద్ తప్ప అన్ని జిల్లాల్లోనూ కార్యకర్తలున్నారు, జిల్లా కమిటీలున్నాయి. ఒక్క చిత్తూరు జిల్లా కమిటీ మాత్రమే, ముఖ్యంగా నరేంద్రనాథ్ అనారోగ్యం తరువాత, చాలావరకు స్తబ్దంగా ఉంది. ఒకరిద్దరు సభ్యులు మాత్రమే ఉన్న ఖమ్మం, ప్రకాశం, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లా కమిటీలలో ఇప్పుడు ఖమ్మం జిల్లా కమిటీ పరిస్థితి స్పష్టంగా మెరుగయింది. ప్రకాశం జిల్లా కమిటీ పరిస్థితి కూడా మెరుగయ్యే సూచనలున్నాయి. విజయనగరం జిల్లా కమిటీని శ్రీకాకుళం సభల తరువాత ఆవిష్కరించాము గానీ అది ఇప్పటికింకా స్వతంత్రంగా కార్యక్రమాలు చేపట్టడం లేదు. రాబోయే రాష్ట్ర మహాసభల లోపల అన్ని జిల్లా శాఖల సభలు ముగించుకొని నిర్మాణాన్ని గురించి స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోగలుగుతాం.

## ప్రత్యేక వేదికలు

నిర్మాణానికి సంబంధించి మనం మొదట్లో కొన్ని ప్రయోగాలు చేసాము. మనది విశాలమైన అజెండా కాబట్టి అందరూ మనతో అన్ని విషయాలలో అంగీకరించకపోవచ్చుననీ కాబట్టి ఆయా విషయాలలో మనతో ఏకీభవించేవారితో ఆ మేరకు కలిసి పనిచేయడానికి పరిమితమైన లక్ష్యంగల వేదికలు ఏర్పాటు చేసుకొని పని చేయడం ద్వారా ఎక్కువ మందిని కలుపుకు పోగలమనీ అనుకున్నాం. ఈ అవగాహనతో అణ్వస్త్ర వ్యతిరేక వేదిక, సేవ్ సింగరేణి, హైదరాబాద్ జంహూరీ ఫోరం, కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం ఏర్పాటు చేసాము. అణ్వస్త్ర వ్యతిరేక వేదిక పేరు మీద అణ్వాయుధాలను వ్యతిరేకించడానికి గల కారణాలను వివరిస్తూ 'అణ్వాయుధాలు-మనం' అనే అనువాద ప్రచురణ తీసుకొచ్చాము. సేవ్ సింగరేణి పేరుమీద, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఒక ముఖ్య ఉపాధి వనరు అయిన సింగరేణి బొగ్గు గనులను ఆధునీకరణ పేరు మీద ఏ విధంగా ప్రజలకు దూరం చేస్తున్నారో వివరించే ఒక ప్రచురణ (సేవ్ సింగరేణి అనే శీర్షికతోనే) తీసుకొచ్చాము. అయితే మనం గమనించింది ఏమిటంటే ఈ వేదికలలో మనకు కలిసొస్తున్న వారు మనం కదిలినప్పుడు, మనం కదిలించినప్పుడు కదులుతున్నారే తప్ప స్వతంత్రంగా చొరవ తీసుకోవడం లేదని, చివరికి పని అంతా మనమే చేస్తున్నామని. అటువంటప్పుడు మన పేరు మీదనే చేసుకుంటే సంస్థకు గుర్తింపయినా పెరుగుతుందని భావించి ఆ సమస్యలపైన కూడా మానవహక్కుల వేదికగానే పని చేయడం మొదలుపెట్టాము.

హైదరాబాద్ జంహూరీ ఫోరం విషయంలోనూ మనకు అదే అనుభవం ఎదురయింది. హైదరాబాద్ పాత బస్తీ రాజకీయాలు మతం చుట్టూ మత చిహ్నాల చుట్టూ తిరుగుతుండడం వల్ల ప్రజల కనీస దైనందిన అవసరాల గురించి ఒక ఉద్యమంగానీ ఆందోళనగానీ లేకుండ పోయిందనీ, పాత నగరంలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని పెంపొందించాలని భావించే వారితో ఒక వేదిక ఏర్పాటు చేయాలనీ అనుకొని ఆ వేదిక ఏర్పాటు చేసాం. (జంహూరియత్ అంటే ఉర్దూలో ప్రజాస్వామ్యం అని అర్థం). దానికొక నిర్మాణం, అజెండా కల్పించాలన్న ఉద్దేశ్యంతో పాతబస్తీలో అనేకసార్లు సమావేశాలు ఏర్పాటు చేసాం. అయితే 'మీరు ముందుండండి సార్, మేము వెనకుండి పనిచేస్తాం' అనే వారే తప్ప బాధ్యతలు తీసుకునే వారెవ్వరూ కనిపించలేదు. ఆ ప్రయత్నం అక్కడితో ఆగిపోయింది.

కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం ఒక వేదికగా కొంత కాలం పని చేసింది. మన రాష్ట్రంలో కృష్ణానది ఎగువ భాగాన ఉన్న దక్షిణ తెలంగాణ, రాయలసీమలకు చెందిన దుర్భిక్ష ప్రాంతాల కోసం ప్రతిపాదించిన మిగులు జలాల ప్రాజెక్టులకు నీటి హక్కులు కల్పించాలంటే ఆ నదీ జలాల హక్కులను పునఃపంపిణీ చేయాలని భావించి, దానికోసం ఆందోళన చేయడానికి ఆ వేదిక ఏర్పాటు చేసాం. నీటి హక్కులకు కాచ్‌మెంట్, బేసిన్ మొదలయినవి కాక నీటి అవసరాన్ని ప్రాతిపదిక చేసుకోవాలన్న అవగాహన ప్రతిపాదించాం. ఎక్కడ వర్షపాతం, భూగర్భజలాలు ఎక్కువ ఉంటాయో అక్కడ నదీ జలాల అవసరం తక్కువ అనీ ఎక్కడ వర్షపాతం, భూగర్భ జలాలు తక్కువ ఉంటాయో అక్కడ నదీజలాల అవసరం ఎక్కువ అనీ ఆ ప్రాతిపదికన నదీజలాల హక్కుల పునఃపంపిణీ జరగాలనీ వాదించాం. మనతో కలిసి వచ్చినవారు ప్రధానంగా మహబూబ్‌నగర్, కడప జిల్లాలకు చెందినవారు. గద్వాలలో, మిర్యాలగూడెంలో, నల్గొండలో, కడప, అనంతపురం, కర్నూలు పట్టణాలలో అనేక సదస్సులు నిర్వహించాం. హైదరాబాద్‌లోనూ ఒక సదస్సు జరిపాం. పెండింగ్ ప్రాజెక్టుల

గురించి సమాచారం సేకరించాం. అయితే గడచిన కొద్ది సంవత్సరాలలో దక్షిణ తెలంగాణ, రాయలసీమల గురించి కలిపి మాట్లాడడం అసాధ్యమైన రాజకీయ వాతావరణం నెలకొనింది. కృష్ణానది మిగులు జలాలలో రాయలసీమకు అసలేవాటా ఇవ్వడానికి వీలులేదన్న వాదన తెలంగాణలో బలపడింది. అటువైపు దక్షిణ తెలంగాణ, రాయలసీమల అవసరాలను సమభావంతో చూడకుండ రాయలసీమ (ప్రత్యేకించి కడప జిల్లా) అవసరాలకు పెద్దపీట వేసే రాజశేఖర రెడ్డి పాలనా నీతిని విమర్శించడానికి అయిష్టత చూపే వైఖరి రాయలసీమలో (ప్రత్యేకించి కడప జిల్లాలో) బలపడింది. అందువల్ల ఈ వేదిక పనిచేసే పరిస్థితి లేకుండ పోయింది. శ్రీకాకుళం మహాసభలలో దీనిని క్లుప్తంగా వివరిస్తూ ఈ రెండు ప్రాంతాలలోనూ సంకుచిత వైఖరులు బలపడిన కారణంగా పునఃపంపిణీకి సంబంధించి ఆందోళన మన పేరు మీదనే కొనసాగించాలి అని తీర్మానించాము. రెండవ కృష్ణా ట్రిబ్యునల్ అవార్డు త్వరలో రానుంది. కాబట్టి అంతవరకు ఆగి దాని పర్యవసానాలను పరిశీలించి పునఃపంపిణీకి సంబంధించిన మన నివేదిక తీసుకొస్తే బాగుంటుంది.

## ఐక్యకార్యాచరణ

ఐక్యకార్యాచరణ గురించి మనం ఒక నిర్ణయం తీసుకున్నాం. తాత్కాలిక లేక స్వల్పకాలిక డిమాండ్లతో మనం కలిసి రాగల అన్ని ప్రజా సంఘాలతో (అవి రాజకీయ ప్రజా సంఘాలయినా స్వచ్ఛంద సంస్థలయినా) కలిసి పనిచేస్తామువగానీ, దీర్ఘకాలిక హక్కుల సమస్యల పైన హక్కుల సంఘాలతో మాత్రమే కలిసి పని చేస్తామన్నది ఈ నిర్ణయం. హక్కుల కార్యచరణకు రాజకీయ రంగు అంటుకోవడం అవాంఛనీయం కాబట్టి ఈ తేడా పాటించాలనుకున్నాం. అందువల్లనే ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా, నిర్బంధానికి వ్యతిరేకంగా అన్ని ప్రజా సంఘాలూ కలిసి ఏర్పాటు చేసిన వేదికలలో మనం చేరలేదు. అవే ప్రజాసంఘాలు వాకపల్లి అత్యాచారం కేసులో పోలీసులను శిక్షించాలన్న డిమాండుతో ఏర్పాటు చేసిన ఐక్యకమిటీలో చేరాము. ఆచరణలో దీర్ఘకాలికం, స్వల్పకాలికం అన్న విభజన రేఖను గుర్తించడం అన్ని సందర్భాలలోనూ సులభం కాకపోయినప్పటికీ స్థూలంగా ఈ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తున్నాం.

అయితే అవగాహన సంగతి అటుంచి, ఐక్యవేదికలలో పని చేయడంవల్ల సమయము, వనరులు వెచ్చించడం తప్ప ఫలితం ఏ మేరకు వస్తున్నది అన్న ప్రశ్న మనల్ని తరచుగా బాధిస్తున్నది. హైదరాబాద్‌లో గడచిన పది సంవత్సరాలలో ఏర్పడిన సంఘీభావ కమిటీలకు, ఐక్య కార్యాచరణ కమిటీలకు లెక్కలేదు. చాలా వాటికి మనల్ని కూడ ఆహ్వానిస్తున్నారు, ఉత్సాహం లేకున్నా మొహమాటానికయినా మనమూ వాటిలో భాగమవుతున్నాం. అయితే ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ఒక సదస్సు జరిపిన తరువాత ఆ వేదిక మళ్లీ కనపడని సందర్భాలే ఎక్కువ. ఇటువంటి ప్రయత్నాలలో భాగం కావడం కంటే విడిగా పనిచేస్తే మన సంస్థకు గుర్తింపు పెరుగుతుంది, చేసిన శ్రమకు తగ్గ ఫలమూ దక్కుతుంది అన్న అనుమానం రాకమానదు.

దేశ వ్యాప్తంగా ఉన్న హక్కుల సంఘాలతో మనకు సంబంధాలు మొదటినుండి ఉన్నాయి. అయితే విప్లవ పార్టీలనయినాసరే హక్కుల కోణం నుండి అవసరమయినప్పుడు విమర్శిస్తాం అనే మన అవగాహన కారణంగా మనల్ని వెలివేసినట్టు చూసే వైఖరి హక్కుల ఉద్యమంలో దేశ వ్యాప్తంగా నెలకొనింది. ఆల్ ఇండియా కోఆర్డినేషన్ ఆఫ్ డెమొక్రాటిక్ రైట్స్ ఆర్గనైజేషన్స్ అనే ఐక్య వేదికలో చేరమని అడిగారు, చేరాము. అయితే ఈ వేదిక కార్యకలాపాలకు ఆహ్వానం ఆలస్యంగా అందడం, తేదీలకు సంబంధించి మన సౌకర్యాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం, జరుగుతున్నది. ఛత్తీస్‌గడ్‌లో సల్వాజుడుం పుడుతున్న తొలిదశలోనే అందరికంటె ముందు పోయి వచ్చింది మనమే అయినప్పటికీ ఆ తరువాత సల్వాజుడుం ఆగడాలపైన నిజనిర్ధారణ చేయడానికి ఛత్తీస్‌గడ్ వెళ్లి వచ్చిన 'అఖిల భారత నిజ నిర్ధారణ కమిటీకి' మనకు ఆహ్వానం లేదు. మన పాటికి మనమే మళ్లీ చాలాసార్లు వెళ్లి వచ్చాము. అక్కడ మావోయిస్టులు పాల్పడిన విచ్చలవిడి హింసాకాండను కూడా విమర్శించాము. వాళ్ల పద్ధతులవల్ల, నిర్ణయాలవల్ల కేవలం పెత్తందార్లే కాక సాధారణ ఆదివాసులు కూడ నష్టపోయిన సందర్భాలున్నాయనీ ఈ విధంగా నష్టపోయిన వారు సల్వాజుడుంలో భాగం అయ్యారనీ అన్నాము. ఒరిస్సాలో విశ్వహిందూపరిషత్ నాయకుడు లక్ష్మణానంద సరస్వతిని మావోయిస్టులు హతమార్చడం బాధ్యతారహితమయిన చర్య అనీ, అంతకుముందు కేవలం అతని పైన దాడి జరిగిందన్న వదంతే క్రైస్తవుల పైన ఎంతటి దాడికి దారి తీసిందో లెక్కలోకి తీసుకోకపోవడం తప్పనీ విమర్శించాము. ఈ అభిప్రాయాలు నచ్చని హక్కుల సంఘాలు మనతో అసలే కలవకున్నా మనకొచ్చిన నష్టమేమీ లేదు. మనం దేశంలో ఏ ప్రాంతానికయినా ఎవరి సహకారం లేకుండా పోయి రాగలుగుతున్నాం. ప్రజలతో మాట్లాడి సమాచారం సేకరించి నివేదికలు తీసుకొచ్చి ప్రచారం చేయ గలుగుతున్నాం. అయితే కలిసి పని చేద్దాం అని ఆహ్వానించి సరయిన సమాచారం ఇవ్వకుండ, నిజమైన అర్థంలో కలుపుకు పోకుండ ఉండడంతోనే సమస్య.

రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలనీ వారికి ఇంటర్వ్యూలు, చదువుకునే రాసుకునే అవకాశాలు, రాజకీయ స్వేచ్ఛ మొదలయిన విషయాలలో ప్రత్యేక హక్కులు కల్పించాలనీ డిమాండ్ చేస్తూ ఒక వేదిక ఈ మధ్య ఏర్పడింది. దానిలో హక్కుల సంఘాలు చేరాలన్న ప్రతిపాదనను మనం తిరస్కరించాము. ఆ వేదిక నిర్వచనం ప్రకారం రాజకీయ ఖైదీలు అంటే ప్రజాతంత్ర లక్ష్యాలకోసం, మెరుగైన సమాజంకోసం పోరాటం చేసిన క్రమంలో అరెస్టయిన వారు అని. ఆ పోరాట క్రమంలో హత్యలకు, ఇతర రూపాలలో హింసాత్మక

చర్యలకు పాల్పడినా కూడ వారిపైన కేసులు పెట్టకూడదనీ విడిచి పెట్టాలనీ డిమాండ్ చేయడాన్ని అంగీకరించలేమని చెప్పాము. వారిపైన టాడా, పోటా వంటి నిర్బంధ చట్టాలు ప్రయోగించకూడదనీ సహజ న్యాయ సూత్రాలను గౌరవించే పద్ధతిలో విచారించాలనీ బెయిలు విషయంలో వివక్ష పాటించకూడదనీ డిమాండ్ చేస్తున్నాం, చేస్తాం. అంతే తప్ప కేసు పెట్టడానికే వీలు లేదని అనలేం. కేవలం విప్లవ రాజకీయాలు, లేక స్వయం నిర్ణయాధికార ఆకాంక్ష కలిగి ఉన్నందుకు, ప్రచారం చేసినందుకు, లేదా అటువంటి సంస్థలలో సభ్యులుగా ఉన్నందుకు, ఎవరిపైనయినా కేసులు పెడితే వారిని విడుదల చేయాలని మాత్రం నిస్సంకోచంగా డిమాండ్ చేస్తాం. జైలులో ఖైదీల హక్కుల విషయానికొస్తే, ఏ విషయంలోనూ ఎవరికీ ఎక్కువహక్కులు ఉండాలని అడగలేం. ఏ హక్కు అడిగినా అందరికీ ఇమ్మని అడుగుతాం.

నయా ఉదారవాద ఆర్థిక విధానాలను, కార్పొరేట్ సంస్థల పెత్తనాన్ని వ్యతిరేకించే సంఘాల ఉమ్మడి వేదికగా అంతర్జాతీయ స్థాయిలో వరల్డ్ సోషల్ ఫోరం పనిచేస్తూ ఉంది. వారు హైదరాబాద్‌లో ఏషియన్ సోషల్ ఫోరం కార్యక్రమాలు నిర్వహించినప్పుడు మనం అందులో పాల్గొనడమే కాక నిర్వహణ బాధ్యతలు కూడా కొంతమేరకు తీసుకున్నాం. ఒకే లక్ష్యం కోసం భిన్న పద్ధతులలో, భిన్న దృక్పథాలతో పనిచేసే సంస్థలు ఒకే సమయంలో ఒకే దగ్గరకి వచ్చి ఎవరి కార్యక్రమం వారు నిర్వహించుకునే సందర్భంగా మనం దానిని అర్థం చేసుకున్నాం. అయితే పని చేసిన క్రమంలో దాని స్వరూపం అట్లా లేదని, ఒక పక్క సిపిఐ (ఎం), మరొక పక్క పెద్ద ఎన్‌జీవోలు, ఆ కార్యక్రమాలపైన తమ పెత్తనం చెలాయించి దాని రూపు రేఖలు నిర్ణయిస్తున్నారని అర్థమయింది. ఈ కారణంగా ఇక మీదట వరల్డ్ సోషల్ ఫోరం కార్యక్రమాలలో సంస్థగా పాల్గొనవద్దని నిర్ణయించుకున్నాం.

ఐక్య కార్యాచరణ గురించి చివరిగా ఒక మాట చెప్పుకోవాలి. ఐక్య కార్యాచరణ మన కార్యాచరణకు ప్రత్యామ్నాయం కాదు. అదే మన కార్యాచరణ కాదు. మన పరిధిలో వచ్చే సమస్యల విషయంలో మనం మన పేరు మీదనే పనిచేయాలి. మనకంటూ ఒక అజెండా, ఒక కార్యరంగం, సామాజిక మార్పులో ఒక పాత్ర ఉన్నాయి. అవి ప్రజలకు పరిచయం కావాలి. సంస్థ గుర్తింపు, ఆలోచనారీతి ప్రజలకు తెలియాలి. మనం మనముగా పనిచేస్తూ ఆపైన మరింత విస్తృతి కోసం ఇతరులతో ఐక్య కార్యాచరణ చేపడతాము.

హైదరాబాద్ నగరంలో ఉంటున్న రాష్ట్ర కమిటీ బాధ్యులకు రాష్ట్రస్థాయి బాధ్యతలు ఉండడంవల్ల, నగర కమిటీని నగరంలోని హక్కుల సమస్యలమీద దృష్టిపెట్టి పనిచేసే కమిటీగా నిర్వహించగల బాధ్యులు లేకపోవడం వల్ల, ఈ మధ్యకాలం దాకా ఈ విచక్షణ పాటించ లేకపోయాము. నగరంలోని ప్రధాన హక్కుల సమస్యలయిన నివాసహక్కులు, వికృతమైన నగరీకరణ, విస్థాపన, కాలుష్యం మొదలయిన విషయాలలో ఛత్రి, ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ మొదలయిన సంస్థలతో కలిసే తప్ప మనముగా పని చేయకపోవడం మనకు నష్టం చేసింది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలో మానవహక్కుల వేదికకు ఉన్న గుర్తింపు హైదరాబాద్ నగర ప్రజలలో లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ స్థితి మెరుగుపడే సూచనలు కనిపిస్తున్నాయి. రేపు జరగబోయే 3వ రాష్ట్ర మహాసభలనాటికి నగరం సమస్యలపైన తానుగా పని చేసే కమిటీగా హైదరాబాద్ నగర కమిటీ రూపం తీసుకుంటుందని భావిస్తున్నాం.

## నిర్మాణం, అవగాహన

కొత్త సభ్యులను తీసుకోవాలన్న నిర్ణయం తీసుకున్న తరువాత అది ఏ విధంగా జరగాలన్న ప్రశ్న వేసుకున్నాము. మన అవగాహనను వివరిస్తూ బహిరంగ కార్యక్రమంగా క్లాసులు నిర్వహించి, హాజరయిన వాళ్లను సంస్థలో చేరమని ఆహ్వానించడం పారదర్శకమైన మార్గం, మన లక్ష్యాలకు తగిన మార్గం అని భావించాము. చాలా జిల్లాల్లో ఒకటికి రెండుసార్లు ఈ కార్యక్రమం నిర్వహించాము. అన్నిచోట్లా చాలామంది హాజరయ్యారు కూడ. అయితే దానివల్ల మన అవగాహన, దృక్పథం ప్రచారం అయ్యాయే తప్ప సభ్యులు దొరకలేదు.

కొత్తగా సభ్యత్వం తీసుకున్నవారంతా మన ఆచరణను చూసి వచ్చినవారే. వీళ్ల న్యాయాన్ని నిలబెట్టడం కోసం కృషిచేస్తున్నారు, మనము కూడ వీళ్లతో చేరుదాం అన్న ప్రేరణే ఎక్కువ పనిచేసింది. మనం చేపట్టే కార్యక్రమాలకూ చేసే పనికీ ఈ ఫలితం ఉంటుందనీ, అదొక ముఖ్యమైన ఫలితమనీ మనం తరచుగా మరచిపోతాం. ఒక విషయానికి మనం స్పందించాలా లేదా అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు ఆ సమస్యను మనం పరిష్కరించగలమా, లేక కొత్తగా ఏమైన చెప్పగలమా, చేయగలమా అన్నదొక్కటే ప్రమాణం కాకూడదు. పత్రికలలో ఇప్పటికే అన్నీ వచ్చేసాయనీ పోలీసులు స్పందించారనీ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసేసాడనీ ఊరుకుండిపోవడం జరుగుతున్నది. అది సరయిన వైఖరి కాదు. పత్రికలలో వచ్చేవార్తలు, అధికారుల స్పందన చాలా సందర్భాలలో పైకి కనిపించినట్టు వాస్తవంలో ఉండవన్న సంగతి అటుంచి, మనం బాధితుల దగ్గరకు పోయి మాట్లాడడం వల్ల వేరే ఫలితాలుంటాయి. అవి అవసరమైన ఫలితాలు. ప్రజలకు మనం పరిచయం అవుతాము. మన ఆలోచనా రీతి, అజెండా పరిచయం అవుతాయి. హక్కుల సమస్యలు ఎక్కడున్నా అక్కడ ప్రజల దగ్గరకు ఈ సంస్థ పోతుంది, మాట్లాడుతుంది అనేది ఇతరులకు ఉత్తేజం కలిగిస్తుంది. కొత్తగా సభ్యులను, కార్యకర్తలను తయారు చేసుకోవడానికి అన్నిటికంటే ఇదే ఎక్కువ ఫలితం ఇచ్చే మార్గం.

సభ్యులకు అవగాహన కల్గించడానికి కూడ ఆచరణే సరయిన సందర్భం. అందుకే నిజనిర్ధారణ కమిటీలలో సీనియర్ కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనడం అవసరం. అప్పుడే సమస్య గురించి, దానికి అనుబంధంగా ప్రభుత్వ విధానాలు, చట్టాలు మొదలయిన వాటి

గురించి కార్యకర్తలకు అవగాహన సమర్ధంగా కల్గించ గలుగుతాం. అధ్యయన తరగతులు జరుపుకుంటాం, జరుపుతున్నాం, కానీ కళ్ల ముందు ఒక సమస్య ఉన్నప్పుడు అర్థమయినంత బాగా అటువంటి క్లాసులలో అర్థం కాదు.

పోలీసుల అధికారాలకు వర్తించే చట్టాలు, భూమిహక్కులు, పునరావాసం, పర్యావరణం, ఏజెన్సీ ప్రాంత ప్రత్యేక హక్కులు, ఇతర ప్రత్యేక సంక్షేమ చట్టాలు మొదలయిన వాటి గురించి సభ్యులకు వివరంగా తెలియడం అవసరం. పైన చెప్పినట్టు కలిసి పని చేసేటప్పుడు వీటి గురించి అవగాహన కలిగించవచ్చు. అయితే అన్ని కోణాలూ అధ్యయనం చేయడానికి క్లాసులు అవసరం. రాష్ట్రస్థాయిలో క్లాసులు జరుపుకునే ప్రయత్నం రెండు సార్లు చేసాము. భూమి హక్కుల గురించి హైదరాబాద్‌లో ఒకసారి, విద్యుత్ రంగ సంస్కరణల గురించి వరంగల్‌లో ఒకసారి జరిపాము. ఈ క్లాసులకు హాజరయిన వారు సంతృప్తి చెందారు గానీ కొందరు మాత్రమే హాజరు కాగలిగారు. బహుశా రెండు మూడు జిల్లాలకు కలిపి ఒక చోట జరుపుకోవడం సరైన మార్గమేమో.

మనది అందరికీ ముందే అంగీకారం ఉండే రాజకీయ దృక్పథం లేక సిద్ధాంతం ఆధారంగా పనిచేస్తున్న సంస్థ కాదు. కొన్ని విలువల చుట్టూ అల్లుకున్న అవగాహననూ ఆచరణనూ రూపొందించుకొని పనిచేస్తున్నాం. అందువల్ల సంస్థ బాధ్యులు కార్యక్రమాలలో వీలయినంత ఎక్కువగా నిమగ్నం అయి అవగాహన ఒక సమగ్రరూపం తీసుకోవడానికి, ఆ అవగాహన కార్యకర్తల ఆలోచనా రీతిలో భాగం కావడానికి కృషి చేయాలి.

## ప్రచురణలు

మనం ప్రచురణలు విరివిగా చేపడుతున్నాం. బులెటిన్ 6 నెలలకొకసారి తీసుకురావాలని అనుకున్నాము గానీ సగటున సంవత్సరానికొకటి తీసుకొస్తున్నాము. బులెటిన్‌కు సభ్యులలో కొంత మంది వ్యాసాలు, రిపోర్టులు రాస్తున్నారు గానీ ఇంకా ఎక్కువ మంది రాయవలసి ఉంది. రిపోర్టులను కథనంగా రాయడం అలవరచుకుంటే ఆసక్తికరంగా ఉంటుంది. బులెటిన్‌లలో రెండింటిని ప్రత్యేక సంచికలుగా తీసుకొచ్చాము. 4వ బులెటిన్ ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంమీద, 10 వ బులెటిన్ విధ్వంసక అభివృద్ధి, విస్థాపనల మీద స్పెషల్ బులెటిన్‌లుగా తీసుకొచ్చాము.

బులెటిన్లే కాక ఒకే ఒక అంశం మీద బుక్‌లెట్లు కొన్ని తీసుకొచ్చాము. ఇవి ప్రధానంగా ఇతర రాష్ట్రాలలో మనం చేపట్టిన నిజనిర్ధారణ నివేదికలు. మొత్తం ఇంగ్లీష్‌లో, తెలుగులో కలిసి 19 ప్రచురణలు తెచ్చాము. 3వ రాష్ట్ర మహాసభలనాటికి ఇంకొక రెండు వస్తాయి. ఒకటి ఒరిస్సా, కర్నాటక దాడుల గురించి తెలుగులో నివేదిక, రెండవది సచార్ కమిటీ రిపోర్టుపైన 9 వ బులెటిన్‌లో అచ్చు వేసిన వ్యాసం. దానిని విడిగా బుక్‌లెట్‌గా వేస్తున్నాం. ఈ ప్రచురణలను అమ్మేపని ఒక కార్యక్రమంగా సంస్థలో కొద్దిమంది మాత్రమే తీసుకుంటున్నారు. అదొక పనిగా భావించి అందరూ చేపట్టాలి. అప్పుడు ఇంకా ఎక్కువ ప్రతులు అచ్చువేయగలుగుతాము. ఇప్పుడు 2000 మాత్రమే వేస్తున్నాము.

అనేక సమస్యల మీద రాష్ట్ర స్థాయిలో కరపత్రాలు వేస్తున్నాము. కొన్నిసార్లు సభలకు అనుబంధంగా, కొన్నిసార్లు విడిగా వేస్తున్నాము. కరపత్రాలు పెద్దగా ఉంటున్నాయని ఒక ఫిర్యాదు ఉందిగానీ అది ఒక్కొక్కసారి తప్పదు. మనం కరపత్రాలలో చర్చిస్తున్న సమస్యలు వివాదాస్పదమయినవి. మన అవగాహన సమాజంలోని సాధారణ అవగాహన కాదు, మీడియాలో ప్రచారమయ్యేదీ కాదు. కాబట్టి చదివే వాళ్లకు అనేక సందేహాలు, ప్రశ్నలు ఉంటాయి. అవేమిటో మనం ఊహించగలము కాబట్టి వాటికి జవాబులు చెప్పుకుంటూ రాయడం తరచుగా అవసరం అవుతుంది. అయితే రాష్ట్ర కమిటీ మాత్రమే కరపత్రాలు వేస్తున్నది తప్ప జిల్లా శాఖలు స్వంతంగా వేస్తున్నది తక్కువ. ఈ మధ్యనే మన సంస్థకు ఒక వెబ్‌సైట్ కూడ రూపొందించాము. దాని చిరునామా **www.humanrightsforum.org** వివిధ జిల్లాలలో చేపట్టే కార్యక్రమాల వివరాలు పంపిస్తే దానిలో పెట్టగలుగుతాం. ప్రస్తుతానికి హైదరాబాద్ నగర కమిటీ కన్వీనర్‌లలో ఒకరయిన కె. మురళి వెబ్‌సైట్ బాధ్యతలు చూసుకుంటున్నాడు.

## ప్రచార రూపాలు, ఉద్యమ రూపాలు

కరపత్రాలు, ప్రచురణలే కాక బహిరంగ సభలు మనం ప్రచారానికి ఉపయోగిస్తున్న మార్గాలు. పూర్తి బహిరంగ స్థలంలో సభలు పెట్టుకునే అవకాశం అన్ని పట్టణాలలోనూ తగ్గిపోతున్నది కాబట్టి అవి హాల్ మీటింగ్‌లే అవుతున్నాయి. జిల్లాకేంద్రాలలోనే కాక వివిధ డివిజన్ కేంద్రాలలో, చిన్న ఊర్లలో కూడ సభలు నిర్వహించాలన్న నిర్ణయం కొన్నిచోట్ల మాత్రమే అమలయింది. రాష్ట్ర కమిటీ నిర్ణయించిన విషయాల మీద సభలు తప్పనిసరిగా జరుపుతున్న జిల్లాలు కొన్ని కాగా, స్వంత నిర్ణయం మీద అనేక విషయాల గురించి సభలు నిర్వహిస్తున్న ప్రత్యేకత వరంగల్ జిల్లా శాఖకు దక్కుతుంది.

ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో చేపట్టిన ప్రచార యాత్రలు గ్రామీణ ప్రాంతాలలో కూడ ప్రచారం చేపట్టడానికొక ఉచిత రూపాన్ని మనకు అలవాటు చేసాయి. విధ్వంసక అభివృద్ధికి వ్యతిరేకంగా మనం గుంటూరు జిల్లా వాన్‌పిక్ ప్రాంతంలోను, ఉత్తర తెలంగాణలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల ప్రాంతంలోనూ, శ్రీకాకుళం జిల్లాలో తీరందగ్గర థర్మల్ ప్లాంట్లు నెలకొల్పుతున్న

ప్రాంతంలోనూ ప్రచార యాత్రలు చేపట్టాము. హాండ్‌మైక్ పట్టుకొని నినాదాలు ఇస్తూ, ప్రసంగిస్తూ విస్తృతంగా మన అవగాహనను ప్రజల లోకి తీసుకుపోగలిగాము. హైదరాబాద్‌లో ఇతర సంఘాలను కలుపుకొని బస్తీలలో అదే కార్యక్రమం తీసుకున్నాము. మళ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలను ఆలోచింప జేసేందుకు చేపట్టిన ప్రచార యాత్ర వరంగల్, నల్గొండ, అనంతపురం, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాలలో కూడా ఇదే పద్ధతిలో జరిగింది. ఈ ప్రచార మార్గాన్ని ఇకమీదట విరివిగా వాడుకోవాలి. అయితే ఇది ప్రజాబాహుళ్యానికి సంబంధించిన విషయాలలోనే ఉపయోగపడుతుంది. అణు ఒప్పందం వంటి అంశాలమీద హాల్ మీటింగ్‌లే ఉచితమైనవి.

ప్రజా సంఘాలు, ప్రజా ఉద్యమాలు బలహీనంగా ఉన్న కారణంగా కొన్ని చోట్ల ప్రజల నిరసనకు ఉద్యమ రూపం ఇచ్చే బాధ్యత మనం ఒక మేరకు నిర్వర్తించవలసి వస్తున్నది. కాకినాడ సెజ్ వ్యతిరేక ఆందోళనలో మనం ఈ పని కొంతవరకు నిర్వహించాము. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న గ్రామాలలో మరింత స్పష్టంగా, ప్రయత్నపూర్వకంగా ఈ పాత్ర నిర్వర్తిస్తున్నాము. విధ్వంసక అభివృద్ధి విధానాలు ఇంకా తీవ్ర రూపంలో కొనసాగే ప్రమాదం ఉంది కాబట్టి ఈ పాత్ర అన్ని ప్రాంతాలలోనూ మనం నిర్వర్తించే అవసరం రావచ్చు.

**మిత్రులారా,**

సంస్థ నిర్మాణ సూత్రాలు, నియమాలు ఎన్ని రాసుకున్నా చివరికి సంస్థ పటిష్టత, ఉద్యమ పురోగమనం మన చొరవ మీద ఆధారపడి ఉంటాయి. మన అజెండా మీద విశ్వాసంతో, మనం సమాజ పురోగతికి అవసరమైన పాత్ర నిర్వర్తిస్తున్నామన్న నమ్మకంతో, ప్రజలకు మన అవసరం ఉంది అన్న గుర్తింపుతో సమస్యలకు స్పందిద్దాం. మనం కదిలి, పదిమందిని కదిలించి సంస్థనూ ఉద్యమాన్నీ ముందుకు తీసుకుపోదాం. మనందరికీ తప్పనిసరి అయిన వృత్తిపరమైన బాధ్యతలూ, కుటుంబ బాధ్యతలూ ఉన్నాయి. మనమెవ్వరం పూర్తికాలం కార్యకర్తలము కాదు. అయితే మనకు అందుబాట్లో ఉన్న సమయాన్ని ఎంత మేరకు, ఎంత ఫలవంతంగా మానవహక్కుల ఉద్యమ పురోగమనం కోసం వెచ్చిస్తున్నాం అని ఎవరికి వారు ప్రశ్నించుకొని ముందుకు పోదాం.

13-6-2009

**కె. బాలగోపాల్**

ప్రధాన కార్యదర్శి

మానవ హక్కుల వేదిక